Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

రాజధాని వార్తలు

RAJADHANI VARTALU




అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue): 299 పేజీలు (Pages): 8 వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

మంగళవారం, 14 - 7 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

# 2 ఏళ్లల్లో ఇరిగేషన్ రంగానికి రూ.24 వేల కోట్లు ఖర్చు

## - ధవళేశ్వరం బ్యారేజీకి రూ.153 కోట్లతో 117 కొత్త గేట్ల ఏర్పాటు పనులు ప్రారంభించిన ముఖ్యమంత్రి









**కొత్తపేట/ఆత్రేయపురం, (రాజధాని వార్తలు):** గోదావరి డెల్టాకు శాశ్వత రక్షణ కల్పించే చర్యలను కూటమి ప్రభుత్వం చేపట్టిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. దీంట్లో భాగంగానే సర్ అర్థర్ కాటన్ బ్యారేజ్ కు కొత్త గేట్లను అమరుస్తున్నట్టు చెప్పారు. ధవళేశ్వరం బ్యారేజీకి రూ.152.95 కోట్ల వ్యయంతో 117 కొత్త గేట్లను అమర్చే పనులను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ఈ మేరకు ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద శిలాఫలాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించిన ముఖ్యమంత్రి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. వచ్చే ఏడాది జూన్ నెలకు కొత్తగేట్ల బిగింపు ప్రక్రియను పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. గోదావరి పుష్కరాలకు గేట్లను అమర్చే పనులను పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి ప్రస్తుతం సముద్రంలోకి ఎంత నీరు వెళ్తోందని సీఎం చంద్రబాబు ఆరా తీశారు. ప్రస్తుతం 27 వేల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి వెళ్తోందని అధికారులు వివరించారు. అలాగే కాల్వలకు ఎన్ని క్యూసెక్కులు విడుదల చేశారని ముఖ్యమంత్రి అడిగారు. 14,700 క్యూసెక్కుల నీరు కాల్వలకు వదిలామని అధికారులు చెప్పారు. కాల్వ చివరి భూములకూ నీరు అందేలా నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని సీఎం ఆదేశించారు. ఈ విషయంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు బాధ్యత తీసుకోవాలని ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలోని పిచ్చుకలంకలో రైతులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గోదావరి డెల్టాకు దేశానికే అన్నపూర్ణ అనే ఖ్యాతి రావడానికి సర్ ఆర్థర్ కాటన్ నిర్మించిన ఆనకట్టే కారణమని, అనంతరం ఎన్టీఆర్ హయాంలో నిర్మించిన కొత్త బ్యారేజీతో మరో పంటకు సాగునీరు అందించే అవకాశం ఏర్పడిందని చంద్రబాబు గుర్తుచేశారు. 2.9 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం, 32.2 లక్షల క్యూసెక్కుల వరదను తట్టుకునే సామర్థ్యంతో పాటు ఈస్టర్న్, సెంట్రల్, వెస్టర్న్ డెల్టాల్లో కలిపి 10.13 లక్షల ఎకరాలకు సాగు నీరు అందేలా బ్యారేజీ ఉపయోగపడుతోందన్నారు. అయితే 50 ఏళ్లకు పైగా గేట్లు, మోటార్లు, విద్యుత్ వ్యవస్థలు పాతబడటంతో వాటి ఆధునీకరణ అత్యవసరమైందని ముఖ్యమంత్రి చెప్పారు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం రూ.32 కోట్లతో కొత్త గేట్లను అమర్చిందని, ఇప్పుడు మిగిలిన పాత గేట్ల స్థానంలో 117 కొత్త గేట్లను తొమ్మిది నెలల్లో అమర్చేలా చర్యలు ప్రారంభించామని సీఎం తెలిపారు. గత పాలకులు ఇరిగేషన్ ప్రాజెక్టులను కనీస నిర్వహణ కూడా చేపట్టలేదని విమర్శించారు. గేట్లు కొట్టుకుపోయినా పట్టించుకోలేదని... కనీసం గ్రీజ్ పెట్టేందుకు అవసరమైన నిధులను కూడా గత పాలకులు ఇవ్వలేదని ముఖ్యమంత్రి అన్నారు. తుంగభద్ర ప్రాజెక్టుకు మొత్తంగా కొత్త గేట్లను బిగించామని వివరించారు. తాము గత రెండేళ్లలోనే సాగునీటి రంగానికి రూ.24 వేల కోట్లు వెచ్చించామని ముఖ్యమంత్రి తెలిపారు.

**పోలవరం నిర్వాసితులను ఆనందంగా ఉంచుతాం**

ఒకప్పుడు కోనసీమలో వరికి మద్దతు ధర లేక రైతులు క్రాప్ హాలిడే ప్రకటించే పరిస్థితి నెలకొంటే, ఇప్పుడు రైతుల ధాన్యానికి గిట్టుబాటు ధరతో పాటు విక్రయించిన 24 గంటల్లోనే డబ్బులు వారి ఖాతాల్లో జమ చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించిందని సీఎం విమర్శించారు. 2014-19 మధ్య 72 శాతం పనులు పూర్తి చేయగా, ఆ తర్వాత ఐదేళ్లలో కేవలం 2 శాతం పనులు మాత్రమే 2 జరిగాయని అన్నారు. టీడీపీ ప్రభుత్వం కొనసాగి ఉంటే 2021 నాటికే పోలవరం పూర్తయ్యేదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పనులు వేగవంతమై ప్రస్తుతం 89 శాతం పురోగతి సాధించామని తెలిపారు. నిర్వాసితులకు పూర్తి న్యాయం చేస్తామని, పునరావాసం, పరిహారం విషయంలో ఎలాంటి రాజీ ఉండదన్నారు. వారిని ఆనందంగా ఉంచుతామని... అనుకున్న సమయానికి పోలవరం ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ప్రకటించిన క్యాలెండర్‌కు అనుగుణంగా ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులు చేపడుతోందని చెప్పారు. పోలవరం పూర్తయితే గోదావరి జిల్లాలకు నీటి సమస్య శాశ్వతంగా తీరుతుందని, పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణా డెల్టా, రాయలసీమకు తరలించి అక్కడి వ్యవసాయ రూపురేఖలనే మార్చామని ముఖ్యమంత్రి వివరించారు. మైక్రో ఇరిగేషన్ విస్తరించడంతో ఉద్యాన పంటలు అభివృద్ధి చెందాయని, పరిశ్రమలకు నీటి సరఫరా సాధ్యమై కియా వంటి భారీ పరిశ్రమలు రాయలసీమకు వచ్చాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

**కూటమిపై గోదావరి జిల్లాల ప్రజల అభిమానం తరగనిది**

గోదావరి ప్రజలు అభివృద్ధిని ఆదరించే స్వభావం కలవారని, గతంలోనూ టీడీపీకి అపూర్వ ఆదరణ ఇచ్చారని చంద్రబాబు గుర్తు చేశారు. 2024 ఎన్నికల్లో కూటమికి ఇచ్చిన భారీ విజయాన్ని రాష్ట్ర అభివృద్ధికి ఇచ్చిన ఆశీర్వాదంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల సహకారం, భగవంతుడి ఆశీస్సులతో ఆర్థిక సవాళ్లను అధిగమించి రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం2ఃు కట్టుబడి ఉందని, పుష్కర ఘాట్ల అభివృద్ధితో పాటు రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో సుమారు రూ.1,200 కోట్లతో మౌలిక వసతులు కల్పించనున్నట్లు వెల్లడించారు. పిచ్చుకలంక, బొబ్బర్లంక ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామని, కోనసీమకు రైల్వే లైన్ తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని చెప్పారు. కోవ్వూరులో కోకో సిటీ ఏర్పాటు చేయనున్నట్లు కూడా ప్రకటించారు. ఆక్వా రైతులకు యూనిట్‌కు రూ.1.50కే విద్యుత్ అందిస్తున్నామని, మెట్ట ప్రాంతాల్లో పామాయిల్, కోకో సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తోందని చెప్పారు. వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గుతున్న నేపథ్యంలో రైతులు పంటల ఎంపికలో శాస్త్రీయ విధానాలు అనుసరించాలని సీఎం సూచించారు.

**అభివృద్ధి-సంక్షేమమే కూటమి లక్ష్యం**

రాష్ట్ర పునర్నిర్మాణమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రధాని నరేంద్ర మోదీ, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో కలిసి ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతున్నామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ నెలలోనే తల్లికి వందనం నిధులు జమ చేస్తామని, సామాజిక భద్రత పెన్షన్లు, రైతు సంక్షేమ కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్నప్పటికీ ప్రజల మధ్యకే రావాలనే తపనతో ఉన్నారని, ముంబై వెళ్లి ఆయనను పరామర్శించి పూర్తిగా కోలుకున్న తర్వాతే ప్రజాసేవలో పాల్గొనాలని సూచించినట్లు చెప్పారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్, రౌడీయిజంపై రాజీపడబోమని సీఎం హెచ్చరించారు. మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు, వ్యక్తిత్వ హననం, సోషల్ మీడియా దుర్వినియోగాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందన్నారు.

గంజాయిని ప్రోత్సహించే వారిపైనా, మహిళలను కించ పరిచే వారిపైనా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రౌడీలతో, బ్లేడ్ బ్యాచ్, గంజాయి బ్యాచ్ లను మించి గొడ్డలి పార్టీతోనే సమస్యలు సృష్టిస్తోందని సీఎం మండిపడ్డారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కుటుంబ సభ్యులపై అసభ్యంగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

వ్యక్తిత్వ హననానికి పాల్పడు తున్నారని... ఆడవాళ్లని అసభ్యంగా మాట్లాడే వారిని గొడ్డలి పార్టీ సమర్థిస్తోందని విమర్శించారు. సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తూ... గొడ్డలి పార్టీ నేతలు ఫైనాన్స్ చేస్తున్నారు.. స్టూడియోలు పెట్టిస్తున్నారని విమర్శించారు. గంజాయి, బ్లేడ్ బ్యాచ్ లను గొడ్డలి పార్టీ సపోర్ట్ చేస్తోందని...వారికి డబ్బులిచ్చి ప్రోత్సహిస్తోందని ముఖ్యమంత్రి చెప్పారు. వీళ్లపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్, పొంగూరు నారాయణ, వాసంశెట్టి సుభాష్, ఎంపీ గంటి హరీష్, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ఆర్టీజీఎస్ సీసీటీవీ 360: వాహన చోరుల సింహస్వప్నం

## - చోరీకి గురైన వాహనాల ఆచూకి పట్టేస్తున్న కెమెరాలు - గుంటూరులో ఒకే ఒక అలెర్టుతో 7 వాహనాల స్వాధీనం - ఎన్టీఆర్ జిల్లాలో మరికొన్ని వాహనాల గుట్టు విప్పిన సీసీటీవీలు - నాలుగు నెలల్లో 81 వాహనాల రికవరీకి సహకారం - మిస్సింగ్ కేసుల దర్యాప్తుల్లోనూ దోహదపడుతున్న ఏఐ ఆధారిత వ్యవస్థ

**అమరావతి, (రాజధాని వార్తలు):** ఈ నెల ఒకటో తేదీ.. బాపట్ల జిల్లా చీరాల. చిత్తు కాగితాలు ఏరుకుని జీవనం సాగించే తల్లి. తన ఆరునెలల చంటిబిడ్డను పొత్తిళ్లలు పెట్టుకుని ఫుట్‌పాత్ మీద ఓ దుకాణం ముందు నిద్రిస్తోంది. తెల్లవారు జామున ఆదమరిచి నిద్రిస్తున్న సమయంలో ఓ ఆగంతుకుడు ఆమె చంటిబిడ్డను ఎత్తుకెళ్లాడు. ఆమె కన్నీరు మున్నీరైంది. బాపట్ల పోలీసులు ఈ కేసును సవాల్‌గా తీసుకున్నారు. బిడ్డను ఎత్తుకెళ్లిన నిందితుడ్ని పట్టుకోవడానికి ఆర్టీజీఎస్ సీసీటీవీ360 వ్యవస్థ సహకారం కోరారు. బిడ్డను ఎత్తుకెళ్లిన వ్యక్తి కదలికలను ఏఐ ఆధారిత కెమెరాల ద్వారా జల్లెడపట్టి 24 గంటల్లోపే నిందితుడ్ని పట్టుకునేలా ఆర్టీజీఎస్ రియల్ టైమ్ అలెర్టులను పోలీసులకు పంపింది. అపహరణకు గురైన బాబును పోలీసులు తీసుకొచ్చి మళ్లీ ఆ తల్లి ఒడికి చేర్చారు. బిడ్డకోసం తల్లడిల్లిన ఆ తల్లి మళ్లీ పొత్తిళ్లలో తన బిడ్డను చూసి మురిసిపోయింది. ఆనందాశ్రువులు కార్చుతూ




పోలీసులకు చేతులు జోడించి కృతజ్ఞతలు తెలిపింది. గుంటూరు నగరం పట్టాభిపురం పోలీసు స్టేషన్ పరిధిలో ఇటీవలే ఒక హోండా యాక్టివా స్కూటర్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. ఎంత అన్వేషించినా దొరకలేదు. చివరకు పోలీసులు ఆర్టీజీఎస్ సీసీటీవీ360 వ్యవస్థ సహకారం కోరారు. పోలీసులు అందించిన ఆ వాహనం వివరాల ఆధారంగా మ్యాట్రిక్ సీసీ కెమెరాల ద్వారా వాహన కదలికలను అన్వేషించారు. జూన్ 17వ తేదీన ఆ స్కూటర్ గుంటూరులోని ఓ ప్రధాన కూడలి వద్ద తిరుగుతుండగా పోలీసులకు రియల్ టైమ్ అలర్టులు పంపారు. వెంటనే పోలీసులు నిందితుడ్ని పట్టుకుని విచారించగా, ఆ స్కూటర్‌తో పాటు మొత్తం ఏడు వాహనాలు చోరీ చేసినట్లు చెప్పడంతో ఆ వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సురక్షిత ఏపీ సాధన దిశగా ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన2 ఆర్టీజీఎస్ సీసీటీవీ360 వ్యవస్థ పనితీరుకు పైరెండు సంఘటనలు ఒక చిన్న ఉదాహరణలు మాత్రమమే. రాష్ట్రంలో శాంతిభద్రతల పర్యవేక్షణలకు , బహుళ ప్రయోజనాల ఆశిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున సీసీ కెమెరాలు ఏర్పాటు చేసింది.2 వీటిని సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్)కు అనుసంధానం చేసి పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్రం వ్యాప్తంగా ప్రస్తుతం 14,750 సీసీకెమెరాలున్నాయి. వీటిని ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సు ఆధారితంగా పనిచేసేలా ఆర్టీజీఎస్ సీసీటీవీ 360 అనే వ్యవస్థను రూపొందించారు. ఈ వ్యవస్థ ఇప్పుడు పోలీసులకు కేసుల దర్యాప్తులో అత్యంత సహాయకారిగా, కీలక సాధనంగా మారుతోంది. పలు కేసులు చేధించడంతో పోలీసులకు కావాల్సిన సాంకేతిక సహకారం అందిస్తోంది.

**వాహనాల దొంగల ఆటకట్టు**

వాహనాలను చోరీ చేసే దొంగల పాలిట ఆర్టీజీఎస్ సీసీటీవీ 360 వ్యవస్థ ఇప్పుడు సింహస్వప్నంలా మారుతోంది. రాష్ట్రంలో దొంగలు ఎక్కడ2 వాహనాల చోరీలకు పాల్పడినా, ఆ వాహన వివరాల ఆధారంగా చోరీకి గురైన వాహనాలను సీసీకెమెరాల ద్వారా ఆర్టీజీఎస్ గాలించి, ఆ వాహనాల ఆచూకీ గురించి పోలీసులకు రియల్ టైమ్‌లో సమాచారం చేరవేస్తోంది. దీంతో ఈ కేసులను పరిష్కరించడం పోలీసులకు చాలా సులభంగా మారుతోంది.

**4 నెలల్లో 80 వాహనాల స్వాధీనం**


ఆర్టీజీఎస్ సీసీటీవీ360 అందించిన ఏఐ ఆధారిత సాంకేతిక సహకాం ద్వారా గత నాలుగు నెలల కాలంలో పోలీసులు 80కి పైగా చోరీకి గురైన వాహనాలను కనుగొని స్వాధీనం చేసుకోగలిగారు. అదృశ్యమైన 73 మంది ఆచూకీని ఈ వ్యవస్థ కనిపెట్టగలిగింది. వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్న 52 మంది నేరస్థుల ఆచూకీ కూడా కనుగొని వారిని పోలీసులు పట్టుకోవడానికి దోహదపడింది.

**ఎన్నో ఉదాహరణలు**

విజయవాడ టు టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో తన వాహనం చోరీకి గురైందని ఓ మహిళ ఫిర్యాదు చేసింది. ఆ వాహన ఆచూకీ కోసం ఆర్టీజీఎస్ సీసీటీవీ 360 సహకారాన్ని పోలీసులు కోరారు. దీంతో సీసీకెమెరాల ద్వారా ఆ వాహన కదలికలపై పోలీసులకు ఆర్టీజీఎస్ ఎప్పటికప్పుడు అలర్టులు పంపడంతో ఆ వాహనాన్ని పట్టుకోగలిగారు. కుటుంబ తగాదాల కారణంగా ఆమె భర్తే ఆ వాహనాన్ని అపహరించినట్లు విచారణలో తేలింది. నందిగామ పోలీసు స్టేషన్ పరిధిలో చోరీకి గురైన మోటారు సైకిల్‌ను చిల్లకల్లువద్ద పటుకోగలిగారు. ఏ.ఎస్.నగర్ పోలీసు స్టేషన్ పరిధిలోనూ ఇలాగే చోరీకి గురైన వాహనాన్ని ఈ సాంకేతిక సహకారంతో పోలీసులు ఇట్టే పట్టుకోగలిగారు. విస్సన్నపేట పోలీసు స్టేషన్ పరిధిలో ఒక వాహన చోరీ కేసు సుదీర్ఘకాలం పెండింగులో ఉంది. ఆర్టీజీఎస్ సీసీటీవీ 360 వ్యవస్థ ద్వారా పోలీసులు ఈ కేసును ఇటీవలే ఇట్టే పరిష్కరించగలిగారు. ఈ పరిధిలోనే చోరీకి గురైన మరోవాహనానని కూడా పోలీసులు ఇట్టే పట్టుకోగలిగారు. మదనపల్లె టూ టవున్ పోలీసు స్టేషన్ పరిధిలో గత ఏప్రిల్ 27న నమోదైన ద్విచక్ర వాహన చోరీ కేసును కూడా అక్కడి పోలీసులు ఆర్టీజీఎస్ సీసీటీవీ360 సాంకేతిక సహకారంతో చేధించగలిగారు.

**మిస్సింగ్ కేసుల్లోనూ**

మనుషుల అదృశ్యం కేసుల్లోనూ ఈ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేస్తోంది. మైలవరం పోలీసు స్టేషన్ పరిధిలో ఒక మహిళ అదృశ్యం కేసు నమోదైంది. ఎంత గాలించినా ఆమె ఆచూకీ తెలీక చాలా కాలంగా ఆ కేసు పెండింగులో ఉంది. దీంతో పోలీసులు ఈ కేసు పరిష్కారం కోసం ఆర్టీజీఎస్ సీసీటీవీ360 వ్యవస్థ సహకారం అడిగారు. ఫేషియల్ రికగ్నిషన్ విశ్లేషణ ద్వారా ఆ మహిళ ఆచూకీని కనుగొని పోలీసులకు అలర్టులు పంపారు. దీంతో పోలీసులు ఆమెను పట్టుకుని ఆమె కుటుంబ సభ్యుల చెంతకు చేర్చి ఈ కేసు పరిష్కరించగలిగారు. అదే రోజు ఎస్.ఆర్.పేటలో ఒక బాలిక అదృశ్యమైందనే కేసు నమోదైంది. అదృశ్యమైన బాలిక ఆ చూకీని అదేరోజు కొన్ని గంటల్లో కనుగొని ఆమెను ఆ కుటుంబ సభ్యులకు అప్పగించడంలో ఈ వ్యవస్థ సహకారమందించింది. రెడ్డిగూడెంలో కూడా ఇటీవలే అదృశ్యమైన ఓ వ్యక్తి ఆచూకీని ఇలాగే కనుగొనగలిగారు. అదృశ్యమైన వ్యక్తి వాహన కదలికలను కెమెరాల ద్వారా పసిగట్టి ఆయన్ను కనుగొనేలా ఈ వ్యవస్థ దోహదపడింది.



# రామతీర్థంలో రథోత్సవంపై శివ పార్వతులు

## ఉభయ కర్తలుగా శంబుని కాపుల సంఘం, తంబి శ్రీనివాసులు - పాతూరు పురవీధుల్లో రథోత్సవంలో భక్తులు

## - లాంచనంగా రథోత్సవంను ప్రారంభించిన తహసీల్దార్ లక్ష్మిప్రసన్న, అధికారులు






**విడవలూరు, (రాజధాని వార్తలు):** రామతీర్థం గ్రామంలో వెలసి ఉన్న శ్రీ కామాక్షి దేవి సమేత రామలింగేశ్వర స్వామికి జరుగుతున్న బ్రహోత్సవల్లో భాగంగా ఆదివారం అధికార లాంచనాలతో మండలం తహసీల్దార్ లక్ష్మి ప్రసన్న, ఆలయ అధికారులు పోలీస్ అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులు రథోత్సవంను ప్రారంభం చేసారు. అనంతరం ఆలయ పూజారి సంప్రదాయం పద్దతిలో రథముపై ఆశీనులు అయిన శివ పార్వతులు కు ప్రత్యేక పూజలు చేసి ప్రజలు అందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. రామతీర్థం పాతూరు గ్రామానికి చెందిన శంభని కాపులు సంఘము మరియు తంబి శ్రీనివాసులు ఉభయ కర్తలుగా వ్యవహరించారు. రామతీర్థం ఆలయము నుండి పాతూరు పుర వీధుల్లో రథముపై స్వామివార్లు భక్తులకు దర్శనం ఇచ్చారు. ప్రతి ఇంటి ముందు స్వామికి కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకొన్నారు. ప్రతి ఒక్కరు భక్తి శ్రద్దలతో శివ పార్వతులకు ప్రత్యేక పూజలు చేసుకొని స్వామి ఆశీస్సులు తీసుకొన్నారు. దేవస్థానం నుండి రథాన్ని భక్తులు లాగుతూ శివనామ స్మరణం జపిస్తూ ఆనందోత్సవాలతో కార్యక్రమంను సాయంత్రం వరకు గడిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గోని స్వామి ప్రసాదలను స్వీకరించారు. పాతూరు గ్రామంలో బాషా యూత్ ఫౌండేషన్ చైర్మెన్, వనమాల జనార్దన్ రావు దాత్రుత్వములో కళాకారులకు భక్తులకు చల్లటి కూల్ డ్రింక్‌లను అందించారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు కటారి సుబ్రహ్మణ్యం, తాత రమేష్, కడియాల రాము, మిగతా సభ్యులు, మాజీ దేవస్థానం చైర్మెన్‌లు, స్థానిక టీడీపీ. కూటమి నేతలు గ్రామ పెద్దలు యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు. రదోత్సవములో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విడవలూరు, ఎస్సై నరేష్, పర్యవేక్షణలో పోలీస్ పహారాను ఏర్పాటు చేసారు.

**నేడే కళ్యాణోత్సవంకు విచ్చేయుచున్న ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి**

రామతీర్థం బ్రహ్మోత్సవములో భాగంగా సోమవారం సాయంత్రం నేడే 13న శివపార్వతులకు జరగనున్న కళ్యానోత్సవంకు శివ పార్వతుల ఆశీస్సులు కొరకు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి విచ్చేయుచున్నట్లు ఆలయ పాలక సభ్యులు తెలిపారు. ఉత్సవాలలో ప్రధాన ఘట్టమైన కళ్యానోత్సవంకు ఏర్పాట్లు పూర్తి అయిందని సమాచారం. కళ్యానోత్సవ ఉభయ కర్తలుగా పెన్నారు ఆక్వాఎక్సపోర్ట్ లిమిటెడ్ అధినేత ఓజిలి కృష్ణ రెడ్డి వ్యవహరిస్తారు. ప్రతి ఏటా ఓజిలి కృష్ణ రెడ్డి అన్నదాన పులిహోర ప్యాకెట్లును వేలాది మందికి పంపిణీ చేస్తుంటారు.

# గ్రామీణ భారతంలోని రహదారుల సమగ్ర డిజిటల్ వ్యవస్థతో అత్యవసర, వాణిజ్య సేవలు మరింత చేరువ

పౌరుల గ్రామీణ భారతావనిలోని రహదారుల అనుసంధాన సమగ్ర వ్యవస్థ దేశాభివృద్ధితో పాటుగా ప్రజల జీవితాల్లో సౌలభ్యాన్ని తీసుకోస్తుంది. ఈ దిశగా భారత ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. ఇందులో కోసం ప్రభుత్వ సమగ్ర విధానాన్ని పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రూపొందించి, పలు మంత్రిత్వ శాఖలు, విభాగాలు, ఏజెన్సీలు కలిసి అమలు చేసేలా చేస్తోంది. పలు ప్రభుత్వ పథకాల కింద నిర్మించిన విస్తృతమైన గ్రామీణ రోడ్డు నెట్‌వర్క్ భారతదేశంలో ఉంది. అయితే, గ్రామాల లోపల ఉండే అంతర్గత రోడ్లను ఎప్పుడూ క్రమబద్ధీకరించి డాక్యుమెంట్ చేయడం లేదా మ్యాపింగ్ చేయడం జరగలేదు. దీంతో గ్రామంలోని వైద్య అత్యవసర పరిస్థితికి స్పందించే అంబులెన్స్ తరచుగా సరైన మార్గాన్ని కనుగొనడంలో, ఏదైనా ప్రమాదం, సంఘటన జరిగినప్పుడు సహాయక చర్యలు కోసం ఫైర్ ఇంజన్లు, పోలీసు వాహనాలు వంటి అత్యవసర సేవలు, తపాలా ఉద్యోగులు, కొరియర్, ఇతర వాణిజ్య సేవలు గ్రామంలోని ఖచ్చితమైన చిరునామాకు చేరుకోలేకపోవడం వంటి నిత్య సమస్యలు తలెత్తున్నాయి. డిజిటల్ మ్యాప్‌లు, నావిగేషన్ అప్లికేషన్‌లు గ్రామాలలో అన్ని మార్గాలను చూపించలేకపోతున్నాయి. భారతదేశంలోని ప్రతి గ్రామంలోని ప్రతి రోడ్డుకు ఒక ప్రత్యేకమైన, గుర్తించదగిన పేరు, కోడ్ ఉండాలి, అది సైన్‌బోర్డ్ పై కనిపించాలి, డిజిటల్ మ్యాప్‌లో గుర్తించబడి జాతీయ డేటాబేస్‌కు అనుసంధానం అవ్వాలి. గ్రామీణ ప్రాంతాల్లోని పౌరులకు జీవన సౌలభ్యాన్ని తీసుకురావడమే దీని 'గ్రామ అంతర్గత రోడ్ల కోడింగ్ మరియు గ్రేడింగ్ విధాన ప్రతిపాదన' లక్ష్యం. తద్వారా వైద్య, తపాలా, పరిపాలనా లేదా వాణిజ్యపరమైన ఏదైనా సేవ గ్రామంలోని ఏ చిరునామాకైనా త్వరగా, గందరగోళం లేకుండా చేరుకోగలదు. ఈ వ్యవస్థ గ్రామంలోని అన్ని రోడ్ల కోసం సరళమైన మూడు-స్థాయిల వర్గీకరణను చేస్తుంది. ముఖ్య రహదారి: గ్రామం గుండా వెళ్ళే లేదా గ్రామాన్ని ఒక చివర నుండి మరొక చివరకు అనుసంధానించే ప్రధాన రహదారికా మెయిన్ రోడ్ 1, మెయిన్ రోడ్ 2 ఇలా క్రమ పద్ధతిలో నంబర్లు ఇస్తారు. ఒకే క్రమంలో సమాంతర రోడ్లు ఉన్నచోట, స్పష్టత కోసం అక్షరాలను జోడిస్తారు, ఉదాహరణకు, మెయిన్ రోడ్ 6ఏ లేదా మెయిన్ రోడ్ 6దీ. క్రాస్ రోడ్: ముఖ్య రహదారిని క్రాస్ లేదా దాటే రోడ్లు. వీటిని కూడా క్రాస్ రోడ్ 1, క్రాస్ రోడ్ 2 ఇలా క్రమ పద్ధతిలో నంబర్లు ఇస్తారు. ఇతర రోడ్డు / కనెక్టెడ్ రోడ్డు: ముఖ్య రహదారి నుండి విడిపోయే చిన్న సందులు, మార్గాలు. వీటికి వరుసగా కోడ్‌లు కేటాయించబడతాయి. ఉదాహరణకు, అండర్ రోడ్ 1, అండర్ రోడ్ 2. ప్రతి రోడ్డుకు రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు దాని లొకేషన్‌ను గుర్తించేలా అక్షరాలు, సంఖ్యల కలయికతో కూడిన కోడ్ కేటాయించబడుతుంది. ఉదాహరణకు: మహారాష్ట్ర, థానే జిల్లా, భివాండిలోని ఒక ప్రధాన రహదారికి ఈ విధంగా కోడ్ చేయవచ్చు: ODR-MH-TN-BHW-001. దాని నుండి విడిపోయే గ్రామ రోడ్డుకు ఇలా కోడ్ చేయవచ్చు: VR-MH-TN-BHW-001-1. దానిని క్రాస్ రోడ్డుకు ఇలా కోడ్ చేయవచ్చు: IVR-MH-TN-BHW-C=1. ఈ ఫార్మాట్ పీఎంజీఎస్వై యొక్క ప్రస్తుత జాతీయ రోడ్డు కోడింగ్ ప్రమాణాలకు మరియు ప్రభుత్వ డేటాబేస్‌లలో ఉపయోగించే లోకల్ గవర్నమెంట్ డైరెక్టరీ కోడ్‌లకు పూర్తిగా అనుకూలంగా ఉంటుంది. ప్రతి రోడ్డుకు తపాలా శాఖ అభివృద్ధి చేసిన జియో-స్పేషియల్ ఐడెంటిఫైయర్ అయిన డిజిపిన్ కోడ్ ట్యాగ్ చేయబడుతుంది. డిజిపిన్ ఒక లొకేషన్ యొక్క ఖచ్చితమైన అక్షాంశ మరియు రేఖాంశ కోఆర్డినేట్లను అందిస్తుంది. ఇది నావిగేషన్ సిస్టమ్‌లు, డిజిటల్ మ్యాప్‌లకు అనుకూలంగా ఉండేలా చేస్తుంది. ఇది ప్రతి గ్రామ రోడ్డుకు డిజిటల్ ప్రపంచంలో ఖచ్చితమైన లొకేషన్ చిరునామా ఉండేలా చూస్తుంది.

పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ అభివృద్ధి చేసిన జియోస్పేషియల్ ప్లానింగ్ మరియు మానిటరింగ్ అప్లికేషన్ 'గ్రామ్ మంచిత్ర'. ఇది అన్ని రోడ్డు కోడ్‌లు, డిజిపిన్ కోడ్‌లు, ఎల్జీడి కోడ్‌లు, పీఎంజీఎస్వై డేటాను ఒకచోట చేర్చే కేంద్ర డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌గా పనిచేస్తుంది. అధికారులు, ప్లానర్లు, పౌరులు ఈ ఒకే సమీకృత ప్లాట్‌ఫారమ్ ద్వారా గ్రామ రోడ్లను వీక్షించవచ్చు, శోధించవచ్చు, పర్యవేక్షించవచ్చు. ఈ రోడ్ల సైన్ బోర్డులు క్యూఆర్ కోడ్‌లను కలిగి ఉంటాయి. ఇవి నివాసితులు, ప్రయాణికులు, డెలివరీ సిబ్బంది, అత్యవసర స్పందనదారులకు సులభంగా అర్థమయ్యేలా అన్ని రోడ్డు గుర్తులు స్థానిక భాష, రోమనైజ్డ్ ఇంగ్లీష్ రెండింటిలోనూ ఉంటాయి. సైన్‌బోర్డుపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసే వ్యక్తి గ్రామ్ మంచిత్ర ద్వారా రోడ్డు సమాచారం, నిర్వహణ చరిత్ర, నావిగేషన్ డేటాను యాక్సెస్ చేయగలరు. ఈ విధానంపై ప్రజా సంప్రదింపుల పత్రాలను ప్రజల ముందుకు మైగవ్ పోర్టల్ ద్వారా తీసుకురావడమైంది. మీ అభిప్రాయాలను సమర్పించేందుకు చివరి తేదీ 14 జూలై 2026. పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ పౌరులు, ప్రజాప్రతినిధులు, సంఘాల నాయకులు, విద్యావేత్తలు మరియు ప్రైవేట్ రంగ సంస్థల నుంచి అభిప్రాయాలను ఆహ్వానిస్తోంది. ఈ వ్యవస్థ అమలులోకి వస్తే, అత్యవసర స్పందన, చివరి మైలు వరకు సేవల డెలివరీ, ప్రభుత్వ పథకాల అమలు మెరుగుగా నిర్వహించబడతాయి మరియు పర్యవేక్షించబడతాయి. రోడ్డు పనులలో పారదర్శకత డిజిటల్ నావిగేషన్, పరిపాలనా సామర్థ్యంతో పాటుగా ఇది అనేక రంగాలలో స్పష్టమైన మెరుగుదలలను అందిస్తుంది.

# గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌కు అనువైన స్థలం గుర్తించండి

## - ఆటోనగర్‌లో పేరుకుపోయిన చెత్తని 10 రోజుల్లో తొలగించండి

## - అధికారులకు స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ ఆదేశాలు



**విజయవాడ, (రాజధాని వార్తలు):** ఐఏఎల్ఏ (ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ) పరిధి ఆటో నగర్ ప్రాంతంలో 'చెత్త సేకరణ, బదిలీ కేంద్రం' (గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్) ఏర్పాటుకు అనువైన ఖాళీ స్థలాన్ని గుర్తించాలని ఏపీఐఐసీ, ఐఏఎల్ఏ అధికారులను స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఆదేశించారు. ఈ కేంద్రం ఏర్పాటుకు అవసరమైన సమగ్ర లేఅవుట్ ప్లాన్, ఇంజనీరింగ్ డిజైన్, అంచనా వ్యయం, ఇతర ప్రాజెక్ట్ పత్రాల తయారీకి సాంకేతిక సహాయం కోరుతూ ఏపీఐఐసీ సంస్థ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్‌కు ప్రతిపాదన పంపాలని చెప్పారు. విజయవాడ ఆటోనగర్ లోని ఏపీఐఐసీ జోనల్ కార్యాలయంలో మున్సిపల్ ఘన వ్యర్థాల నిర్వహణపై సోమవారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆటోనగర్ లో పేరుకుపోయిన చెత్త తొలగించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని చైర్మన్ పట్టాభిరామ్ అధికారులను ఆదేశించారు. ఈ ప్రతిపాదిత గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ తాత్కాలిక సేకరణ, చెత్త వేర్వేరుగా విభజించే కేంద్రంగా పనిచేస్తుంది. ఇక్కడ సేకరించిన చెత్తను కాంపాక్టర్ల ద్వారా జిందాల్ వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్‌కు తరలించి శాస్త్రీయ పద్ధతిలో నిర్మూలిస్తారు. ఈ అత్యాధునిక బదిలీ కేంద్రం ఏర్పాటుకు అవసరమైన లేఅవుట్, ప్రణాళిక, డిజైన్, సాంకేతిక అంశాల రూపకల్పనలో సహాయపడేందుకు స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ ఇంజనీరింగ్ బృందాన్ని పంపిస్తుందని చైర్మన్ పట్టాభిరామ్ తెలిపారు. ప్రధానంగా ఈ సమావేశంలో మున్సిపల్ ఘన వ్యర్థాల సమర్థవంత నిర్వహణ, చెత్త పారవేత, చుట్టుపక్కల పట్టణ స్థానిక సంస్థలు, ఐఏఎల్ఏ ప్రాంతాలలో ఉత్పత్తి అయ్యే ఘన వ్యర్థాల రవాణా సౌకర్యం తదితర అంశాలను సమీక్షించారు. పరిసర ప్రాంతాలలోని స్థానిక సంస్థల ద్వారా ఉత్పత్తి అయ్యే మున్సిపల్ ఘన వ్యర్థాల రోజువారీ పరిమాణం, ఆటో నగర్ వద్ద పేరుకుపోయిన చెత్తకు సంబంధించిన వివరాలను చైర్మన్ పట్టాభిరామ్ ఐఏఎల్ఏ కమిషనర్‌ని అడిగి తెలుసుకున్నారు. ఆటో నగర్ పరిధిలో ప్రస్తుతం అమలులో ఉన్న అంతర్గత చెత్త సేకరణ విధానం గురించి ఐఏఎల్ఏ కమిషనర్‌ను అడిగి తెలుసుకున్నారు. తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్, తమ మున్సిపల్ పరిధిలో రోజుకు సుమారు 110 మెట్రిక్ టన్నుల (ఎంటీ) చెత్త ఉత్పత్తి అవుతోందని తెలిపారు. గుంటూరులోని జిందాల్ వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్ మెయింట్ నెన్స్ నిమిత్తం తాత్కాలికంగా మూసివేసినందున మున్సిపల్ ఘన వ్యర్థాల తరలింపు నిలిచిపోయి, దాదాపు 2,000 మెట్రిక్ టన్నుల చెత్త ఆటోనగర్ లో పేరుకుపోయిందని తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ తెలిపారు. కాంపాక్టర్ నిర్వహణ బృందం ఇన్‌ఛార్జ్ రామ్మోహన్, తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్‌లు పేరుకుపోయిన చెత్త తొలగింపునకు సంబంధించి ఒక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని చైర్మన్ పట్టాభిరామ్ ఆదేశించారు. అలాగే, అవసరమైన సిబ్బంది, యంత్రాలు, రవాణా ఏర్పాట్లను సమకూర్చుకుని, పేరుకుపోయిన చెత్తను పది రోజులలోపు, అంటే ఈ నెల 23 లోపు పూర్తిగా తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం అద్దెకు తీసుకున్న టిప్పర్ వాహనాల ద్వారా చెత్త సేకరణ జరుగుతోందని ఐఏఎల్ఏ కమిషనర్ చైర్మన్ పట్టాభిరామ్ కు తెలిపారు. వీధి వీధిలో దుకాణాల వెంట తిరిగి చెత్త సేకరించే సాధారణ టిప్పర్ కార్యకలాపాలకు బదులుగా, పనితీరు సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి 'ఎలక్ట్రిక్ వాహనాలను' వినియోగించవచ్చని స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ చైర్మన్ సూచించారు. సర్వీస్ మోడల్‌లో అనుభవం కలిగిన ఏజన్సీల నుంచి వాహనాలను తీసుకుని అద్దె చెల్లించవచ్చని, తద్వారా మున్సిపల్ ఘన వ్యర్థాల సేకరణ సమర్థవంతంగా జరుగుతుందన్నారు. ఆటోనగర్ ఐఏఎల్ఏ కమిషనర్ బాబ్జీ, తమ పరిధిలో రోజుకు సుమారు 15 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోందని చైర్మన్ పట్టాభిరామ్ కు తెలిపారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్ (ఏఎంఓహెచ్), సంబంధిత నిర్వహణ ప్రాంతంలో రోజుకు సుమారు 130 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోందన్నారు.

ఈ సమావేశంలో ఏపీఐఐసీ సీజీఎం ఐఎల్ రామ్, ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ చైర్మన్ సుంకర దుర్గా ప్రసాద్, జోనల్ మేనేజర్ అండ్ కమిషనర్ బాబ్జీ, డిప్యూటీ జోనల్ మేనేజర్లు ఎం.దొరబాబు, జి.జ్యోతి, ఫైనాన్స్ మేనేజర్ జి.బాలమ్మ, మేనేజర్ (ఇంజనీరింగ్) ఎండీ ఇస్మాయిల్ బేగ్, విజయవాడ మున్సిపల్ కార్పోరేషన్ ఏఎంహెచ్ఓ గోపాల నాయక్, తాడిగడప మున్సిపల్ కమిషనర్ నజీర్, శానిటరీ ఇనస్పెక్టర్ సుధాకర్, కాంపాక్టర్ మెయింట్‌నెన్స్ టీమ్ ఇన్‌చార్జి నూతక్కి రామమోహన్, ఆటోనగర్ ఐఏఎల్ఏ మాజీ అధ్యక్షులు ఎస్.దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ రాష్ట్ర మత్స్యకారుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది : నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

## - ఆంధ్రప్రదేశ్ జలాల్లో అక్రమ చేపల వేటను ఏమాత్రం సహించబోం - తమిళనాడు అధికారులకు ఆధారాలతో వివరించాం

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్-తమిళనాడు అంతర్ రాష్ట్ర జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల కీలక వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్ సముద్ర జలాల్లో తమిళనాడు, పుదుచ్చేరికి చెందిన బోట్లు అక్రమంగా చేపల వేట సాగించడం వల్ల రాష్ట్ర మత్స్యకారులు ఎదుర్కొంటున్న నష్టాన్ని వీడియోలు, ఫోటోలు, జీపీఎస్ టైమ్‌స్టాంప్‌లు, ఇతర సాంకేతిక ఆధారాలతో తమిళనాడు అధికారులకు వివరించినట్లు తెలిపారు. ఈ అంశంపై తమిళనాడు ప్రతినిధులు సమస్య తీవ్రతను అర్థం చేసుకుని, తమ రాష్ట్రంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి మత్స్యకారులకు అవగాహన కల్పించి, ఆంధ్రప్రదేశ్ జలాల్లోకి అక్రమ ప్రవేశాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ తీరానికి 23 కిలోమీటర్ల పరిధిలోకి ఇతర రాష్ట్రాలకు చెందిన చేపల వేట బోట్లు ప్రవేశించడం చట్టవిరుద్ధమని, రాష్ట్ర మత్స్యకారుల జీవనోపాధి, సముద్ర జీవవైవిధ్య పరిరక్షణ కోసం కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. గత మూడు నెలలుగా ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రత్యేక సముద్ర గస్తీ కొనసాగుతోందని, అక్రమంగా ప్రవేశించే బోట్లపై నిరంతర నిఘా ఉంటోందని తెలిపారు. ముఖ్యంగా పుదుచ్చేరి నుంచి భారీ ట్రాలర్లు ఆంధ్రప్రదేశ్ జలాల్లోకి వచ్చి చేపల వేట నిర్వహించడం వల్ల మత్స్యకారుల వలలు దెబ్బతినడంతో పాటు సముద్ర జీవవైవిధ్యానికి తీవ్ర నష్టం జరుగుతోందని వివరించారు. అక్రమంగా ప్రవేశించిన తమిళనాడు, పుదుచ్చేరికి చెందిన ఏడు బోట్లను సీజ్ చేశామని, ప్రస్తుతం వాటిని విడుదల చేసే ప్రసక్తే లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. సంబంధిత రాష్ట్రాలు సమర్థవంతమైన చర్యలు తీసుకున్న తర్వాతే రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తదుపరి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ప్రతి చేపల వేట బోటులో ట్రాన్స్‌పాండర్ తప్పనిసరిగా అమర్చాలని, అది ఎల్లప్పుడూ ఆన్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు. సముద్ర గస్తీని మరింత పటిష్ఠంగా కొనసాగిస్తూ, భవిష్యత్తులో కూడా అక్రమంగా ప్రవేశించే బోట్లను స్వాధీనం చేసుకుని జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌కు తరలిస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలోని మత్స్యకారుల సంక్షేమం, వారి జీవనోపాధి పరిరక్షణకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ, పోలీస్ శాఖ జిల్లా ఎస్పీ వేజెండ్ల ఉన్నత అధికారులు. మత్స్యకారులు కమిటీ సభ్యులు ఉన్నారు.



**ముంబయి కోకిలబెన్ ఆసుపత్రిలో కుడి భుజానికి శస్త్ర చికిత్స చేయించుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ని సోమవారం సాయంత్రం మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ పరామర్శించారు. పవన్ కళ్యాణ్‌తో మాట్లాడి ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు. పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని దేవేంద్ర ఫడ్నవీస్ ఆకాంక్షించారు.**

# రాష్ట్ర మత్స్యకారులకు జరుగుతున్న నష్టాన్ని ఆధారాలతో వివరించాం

**- సమస్య తీవ్రత, మన ఆవేదనను తమిళనాడు ప్రతినిధులు అర్థం చేసుకున్నారు - తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు - ఆంధ్రప్రదేశ్ జలాల్లో అక్రమ చేపల వేటను ఏమాత్రం సహించబోం - ప్రత్యేక బృందాలతో నిరంతరం గస్తీ కొనసాగుతోంది - మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది : జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల స్పష్టం - నెల్లూరులో ఆంధ్రప్రదేశ్-తమిళనాడు అంతర్ రాష్ట్ర జిల్లా స్థాయి కమిటీ సమావేశం**

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ తీరానికి 23 కిలో మీటర్ల పరిధిలోకి ఇతర రాష్ట్రాలకు చెందిన చేపల వేట బోట్లు ప్రవేశించడం చట్టవిరుద్ధమని, రాష్ట్ర మత్స్యకారుల జీవనోపాధి, సముద్ర జీవవైవిధ్యాన్ని పరిరక్షించేందుకు అక్రమంగా ప్రవేశించే బోట్లపై కఠిన చర్యలు కొనసాగుతాయని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల స్పష్టం చేశారు. శనివారం కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ హాల్‌లో ఆంధ్రప్రదేశ్-తమిళనాడు అంతర్‌రాష్ట్ర జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ రామశంకర్ నాయక్, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, జిల్లా ఎస్పీ డా.అజిత వెజెండ్ల, జిల్లా అటవీశాఖ అధికారి షేక్ మహబూబ్ బాషా, మెరైన్ మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు డా.పి.సురేష్, జిల్లా మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు పి.లక్ష్మణరావు, ప్రకాశం జిల్లా సంయుక్త సంచాలకులు చి. శ్రీనివాసరావు, అసిస్టెంట్ డైరెక్టర్ చాంద్ బాషాతో పాటు మెరైన్ పోలీసు అధికారులు పాల్గొన్నారు. తమిళనాడు రాష్ట్రం నుంచి మత్స్యశాఖ, మత్స్యకారుల సంక్షేమ శాఖ డైరెక్టర్ డా. విజయకార్తికేయన్, చెన్నై జిల్లా కలెక్టర్ మాలతి హెలెన్, రాయపురం అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ పరమనాథం, స్టేట్ ఇంటెలిజెన్స్ వింగ్ డీఎస్పీ కరియప్పన్, అదనపు మత్స్యశాఖ డైరెక్టర్ నూర్‌జహాన్ బీవి, ప్రాంతీయ సంయుక్త సంచాలకులు ఎలంగో సమావేశానికి హాజరయ్యారు. తమిళనాడు, పుదుచ్చేరి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మత్స్యకారుల సమస్యలు, సముద్ర జలాల్లో అక్రమ ప్రవేశాల వల్ల కలుగుతున్న నష్టం తదితర అంశాలపై ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల ప్రతినిధులు సుదీర్ఘంగా



చర్చించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్, ఎస్పీ తమిళనాడు అధికారులకు వివరించారు. సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మీడియాతో మాట్లాడుతూ, గత మూడు నెలలుగా మన జిల్లా సరిహద్దు తీర ప్రాంతంలోని సముద్ర జలాల్లో అక్రమంగా చేపల వేట సాగిస్తున్న తమిళనాడు, పుదుచ్చేరికి చెందిన మత్స్యకారుల వల్ల మన రాష్ట్ర మత్స్యకారులకు కలుగుతున్న నష్టాన్ని తమిళనాడు అధికారులకు సమావేశంలో సవివరంగా వివరించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మే నెల నుంచి ప్రత్యేక సముద్ర గస్తీ ప్రారంభించిన అనంతరం అక్రమ ప్రవేశాలపై కఠిన నిఘా కొనసాగుతోందని పేర్కొన్నారు. మత్స్యకారుల సమస్యలను నాలుగు విభాగాలుగా వర్గీకరించి తమిళనాడు ప్రతినిధులకు వివరించినట్లు కలెక్టర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బోట్లు, తమిళనాడుకు చెందిన బోట్లు, తమిళనాడు బోట్లలో పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులు, చిన్న అవుట్‌బోర్డ్, ఇన్‌బోర్డ్ ఇంజిన్ బోట్ల ద్వారా అక్రమంగా ప్రవేశించే వారి సమస్యలను విడివిడిగా వివరించామని, ముఖ్యంగా నాలుగో కేటగిరీ వల్లే అధిక సమస్యలు ఎదురవుతున్నాయని చెప్పారు. ప్రస్తుతం అత్యధిక సమస్య పుదుచ్చేరి నుంచి వస్తోందని, అక్కడి నుంచి 640 హార్స్‌పవర్ సామర్థ్యం గల భారీ ట్రాలర్లు గుంపులుగా వచ్చి ఆంధ్రప్రదేశ్ జలాల్లో చేపల వేట నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఈ బోట్లు రాష్ట్ర మత్స్యకారుల వలలను ధ్వంసం చేయడంతో పాటు సముద్ర జీవవైవిధ్యానికి కూడా తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. అక్రమ చేపల వేటకు సంబంధించిన వీడియోలు, ఫోటోలు, జీపీఎస్ టైమ్‌స్టాంప్‌లు, బోట్ల వివరాలు వంటి సాంకేతిక ఆధారాలను సమావేశంలో తమిళనాడు ప్రతినిధులకు ప్రదర్శించినట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే భారీ ట్రాలర్లు, నిషేధిత వలల వినియోగం వల్ల రక్షిత జాతికి చెందిన ఆలివ్ రిడ్లే తాబేళ్లు మృతి చెందుతున్న విషయాన్ని కూడా వివరించినట్లు చెప్పారు. ఈ ఆధారాలను పరిశీలించిన తమిళనాడు ప్రతినిధులు సమస్య తీవ్రతను, మన బాధను అర్థం చేసుకొని, తమ రాష్ట్రానికి చేరుకున్న వెంటనే చెన్నైలో ఒక ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మత్స్యకారులకు అవగాహన కల్పించి, ఆంధ్రప్రదేశ్ జలాల్లోకి ప్రవేశించకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు కలెక్టర్ వెల్లడించారు. మన తీరం పరిధిలోని సముద్ర జలాల్లోకి అక్రమంగా ప్రవేశించిన తమిళనాడు, పుదుచ్చేరికి చెందిన సీజ్ చేసిన ఏడు బోట్లను విడుదల చేయాలని తమిళనాడు ప్రతినిధులు విజ్ఞప్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అయితే ప్రస్తుతానికి ఏ బోటును విడుదల చేసే ప్రసక్తే లేదని, తమిళనాడు అధికారులు తీసుకునే చర్యలను పరిశీలించిన అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మాత్రమే బోట్ల విడుదలపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రతి చేపల వేట బోటులో ట్రాన్స్‌పాండర్‌ను తప్పనిసరిగా అమర్చాలని, అది ఎల్లప్పుడూ ఆన్‌లో ఉండాలని సమావేశంలో సూచించినట్లు తెలిపారు. 23 కిలోమీటర్ల పరిధిలోకి ప్రవేశించే సమయంలో ట్రాన్స్‌పాండర్ ద్వారా హెచ్చరిక సందేశాలు అందే విధంగా వ్యవస్థ పనిచేస్తోందని వివరించారు. జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో సముద్ర గస్తీ నిరంతరం కొనసాగుతోందని, భవిష్యత్తులో కూడా అక్రమంగా ఆంధ్రప్రదేశ్ జలాల్లోకి ప్రవేశించే ఏ బోటునైనా స్వాధీనం చేసుకుని జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌కు తరలిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. సంబంధిత రాష్ట్రాలు తమ మత్స్యకారులు నిబంధనలు పాటించేలా ఆచరణాత్మక చర్యలు తీసుకునే వరకు సీజ్ చేసిన బోట్లను విడుదల చేసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు.

సమావేశానికి పుదుచ్చేరి అధికా రులు హాజరు కాకపోవడంపై ఆందోళన వ్యక్తం చేసిన అధికా రులు, సమావేశ నిర్ణయాలను తమిళనాడు ప్రభుత్వంతో పాటు పుదుచ్చేరి ప్రభుత్వానికి కూడా అన్ని ఆధారాలతో పంపించాలని నిర్ణయించారు. రాష్ట్రంలోని మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి విజయకుమార్, మత్స్యశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 'సర్' గడువును 3 నెలలు పొడిగించాలి

**- పట్టణాల్లో బీఎల్ఓలకు అవగహన లేక ఘోరంగా నష్టం - ఓటు హక్కు కోల్పోయే ప్రమాదంలో 40 శాతం మంది ఓటర్లు - రేషన్, ఆధార్, పాస్‌పోర్ట్ ఉన్నా పౌరసత్వ నిరూపణ పేరిట వేధింపులేంటి? - సిఏఏకు ప్రత్యామ్నాయంగా ఎస్ఐఆర్ వ్యూహమా? - అర్హులందరినీ ఓటర్లుగా నమోదు చేసే వరకు వదిలిపెట్టేది లేదు - ఎమ్యున్యూరేషన్ ఫార్మ్స్ ఇవ్వగానే రసీదు తప్పనిసరిగా ఇవ్వాలి - సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య డిమాండ్ - రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వివేక్ యాదవ్‌కు సీపీఐ బృందం సవివరమైన వినతి - రాజకీయ పార్టీల అప్పీల్స్ అధారంగా కేంద్ర ఎన్నికల సంఘానికి ప్రతిపాదనలు పంపుతామని ఎస్ఈసీ హామీ**

**అమరావతి, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న 'సర్' ప్రక్రియ గడువును తక్షణమే మరో మూడు నెలల పాటు పొడిగించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కును కల్పించే బాధ్యతను ఎన్నికల కమిషనే తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వివేక్ యాదవ్‌ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య, మాజీ ఎమ్మెల్సీ జెల్లి విల్సన్, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.జగదీష్‌లు కలిసి క్షేత్రస్థాయి అక్రమాలు, ఇబ్బందులపై సుదీర్ఘంగా వివరించి, సవివరమైన వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం ఈశ్వరయ్య మీడియాతో మాట్లాడుతూ..అధికారులు ప్రస్తుతం ప్రకటిస్తున్న ఎమ్యున్యూరేషన్ ఫార్మ్స్ లెక్కలు ఎంతమాత్రం సరైనవి కావని, క్షేత్రస్థాయిలో వాస్తవాలు భిన్నంగా ఉన్నాయని ధ్వజమెత్తారు. అరకొర ఏర్పాట్లు, కాలపరిమితితో లక్షలాది మంది పేద, మధ్యతరగతి పౌరులను ఓటర్ల జాబితా నుండి దూరం చేసే కుట్రలు సాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన ఓటు హక్కు విషయంలో కమిషన్ నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని, తక్షణమే స్పందించి నిర్దిష్టమైన కాలవ్యవధితో గడువును పెంచాలని ఆయన డిమాండ్ చేశారు.

**క్షేత్రస్థాయిలో వైఫల్యాలతో..ఓటు హక్కు కోల్పోయే ప్రమాదంలో పౌరులు**

ప్రభుత్వ అధికారులు చెప్తున్న కాగితపు లెక్కలకు, క్షేత్రస్థాయిలో జరుగుతున్న దానికి అసలు పొంతనే లేదని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ ప్రక్రియ ఎదో ఒక రకంగా కొంతవరకు నడిచినప్పటికీ, పట్టణ ప్రాంతాల్లో మాత్రం దారుణంగా విఫల



మైందని ధ్వజమెత్తారు. నగరాలు, పట్టణాల్లో ఉన్న మెజారిటీ ప్రజలకు అసలు ఈ అప్లికేషన్లు పూర్తిస్థాయిలో అందనే లేదన్నారు. ఒకవేళ కొన్ని చోట్ల అప్లికేషన్లు అందినప్పటికీ, వాటిని ఎలా పూర్తి చేయాలి, ప్రక్రియ విధానం ఏంటనే విషయాలపై ప్రజలను ఎడ్యుకేట్ చేయడంలో, వారిలో అవగాహన కల్పించడంలో బూత్ లెవెల్ అధికారులకే అవగహన లేక ఘోరంగా వైఫల్యం చెందారని ఆరోపించారు. బీఎల్ఓల నిష్క్రియాపరత్వం, అధికారుల సమన్వయ లోపం కారణంగానే ఈరోజు కేవలం 60 శాతం మంది మాత్రమే ఫారాలు పూర్తి చేసి ఇవ్వగలిగారని, మిగిలిన 40 శాతం మంది పౌరులు ఓటర్లు కాకుండా పోయే ప్రమాదకర పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిదంగా ఎమ్యున్యూరేషన్ ఫార్మ్స్ ఇవ్వగానే రసీదు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. ఒక్క ఓటరు కూడా తన హక్కును కోల్పోవడానికి వీల్లేదని, అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఓటు కల్పించాల్సిన బాధ్యత కమిషన్‌పైనే ఉందని ఈశ్వరయ్య స్పష్టం చేశారు.

**సిఏఏకు ప్రత్యామ్నాయంగా ఎస్ఐఆర్ వ్యూహమా?**

భారతదేశంలో ఒక పౌరుడి గుర్తింపునకు ప్రామాణికాలైన రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఓటర్ కార్డు, చివరికి అంతర్జాతీయంగా అత్యున్నత గుర్తింపు కలిగిన పాస్‌పోర్ట్ వంటి బలమైన ఆధారాలు ఉన్నప్పటికీ... ఈ 'సర్' ప్రక్రియలో భారతీయ పౌరసత్వాన్ని నిరూపించుకోవడానికి ఇంకా మరేదో కావాలనే పద్ధతిలో నిబంధనలు పెట్టడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా వివాదాస్పదంగా తీసుకొచ్చిన సిఏఏ చట్టానికి ప్రత్యామ్నాయంగా, దొడ్డిదారిన ఈ 'సర్'ను ఏమైనా రాష్ట్రంలో అమలు చేస్తున్నారా? అని ఈశ్వరయ్య నిలదీశారు. సాధారణ ఓటర్ల నమోదు ప్రక్రియను ఇంత సంక్లిష్టం చేయడం వెనుక, ప్రజలను ఇంతలా తాత్సారం చేయించడం వెనుక ఉన్న అసలు అంతరార్థం, రాజకీయ వ్యూహం ఏమిటని ప్రశ్నించారు.

**వలస ఓటర్ల ఇబ్బందులు -- 2002 నిబంధనతో తీవ్ర అన్యాయం**

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నివసించే సామాన్య, పేద ప్రజలు ఉపాధి, కూలి పనులు, ఇతర ఆర్థిక అవసరాల రీత్యా నిరంతరం ఇళ్లు మారుతుంటారని సీపీఐ గుర్తు చేసింది. ముఖ్యంగా అద్దె ఇళ్లల్లో నివసించే వారు తరచూ ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వలస వెళ్తున్న తరుణంలో, 2002 ఓటర్ లిస్టులో పేరుండాలనే కొర్రీలు పెట్టడం వల్ల వేలాది మంది అర్హులు జాబితా నుంచి తొలగించబడే ముప్పు పొంచి ఉందన్నారు. అదేవిదంగా ఈ ఏడాది సరైన వర్షాలు లేక రాయలసీమ, ప్రకాశం, పల్నాడు, ఉత్తరాంధ్రలో వలసలు పెరిగాయని దీంతో గ్రామాలు ఖాళీగా మారుతుండడంతో ఓటరు నమోదు కావడం లేదన్నారు. స్థానిక పరిస్థితులను, సామాన్యుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోకుండా ఇష్టానుసారంగా నిబంధనలు రుద్దడం ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధమని మండిపడ్డారు.

**సీపీఐ డిమాండ్లు ఇవే**

'సర్' ప్రక్రియ గడువును ఎటువంటి తాత్సారం లేకుండా తక్షణమే మరో మూడు మాసాల పాటు పొడిగించాలి. ప్రతి గ్రామ సభలో, వార్డు, గ్రామ సచివాలయాల పరిధిలో ప్రత్యేక అవగాహన సదస్సులు, సభలను అధికారికంగా ఏర్పాటు చేయాలి. బీఎల్ఓలను పూర్తిస్థాయిలో రంగంలోకి దించి, వారి ద్వారా ప్రజలను చైతన్యపరిచి, అర్హులైన ప్రతీ ఒక్కరినీ ఓటరుగా నమోదు చేసే బాధ్యతను కమిషనే స్వయంగా తీసుకోవాలి.

**సానుకూలంగా స్పందించిన ఎస్ఈసీ వివేక్ యాదవ్**

సీపీఐ బృందం లేవనెత్తిన అంశాలు, క్షేత్రస్థాయి ఇబ్బందులపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వివేక్ యాదవ్ సానుకూలంగా స్పందించారు. కేవలం సీపీఐ మాత్రమే కాకుండా, రాష్ట్రంలోని ఇతర ప్రధాన రాజకీయ పార్టీలు కూడా ఈ గడువు పొడిగింపు, ఓటర్ల ఇబ్బందులపై తమకు అప్పీల్ చేశాయని ఈ సందర్భంగా కమిషనర్ గుర్తు చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి ఓటు హక్కు రక్షణకు కమిషన్ కట్టుబడి ఉంటుందని పేర్కొంటూ... రాజకీయ పార్టీలు కోరిన విధంగా గడువు పొడిగింపు ప్రతిపాదనలను, క్షేత్రస్థాయి నివేదికలను తదుపరి తుది నిర్ణయం కోసం కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి వెంటనే పంపుతామని, అక్కడి నుంచి వచ్చే ఆదేశాల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని సీపీఐ బృందానికి ఎస్ఈసీ స్పష్టమైన హామీ ఇచ్చారు.

# జిల్లాలో సమృద్ధిగా యూరియా నిల్వలు : జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లాలోని రైతు సోదరులకు సాగు ఇబ్బందులు లేకుండా, ప్రస్తుత ఖరీఫ్ (2026-27) సీజన్‌కు సంబంధించి అన్ని రకాల పంటలకు అవసరమైన యూరియా పంపిణీకి జిల్లా యంత్రాంగం పక్కా ప్రణాళికను సిద్ధం చేసింది. జిల్లాలో యూరియా ఎరువుల కొరత ఏమాత్రం లేదని, రైతులు ఎలాంటి ఆందోళన లేదా ఊహాగానాలకు లోను కాకుండా తమ వ్యవసాయ పనులను నిశ్చింతగా కొనసాగిం చవచ్చని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, శనివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

యూరియా నిల్వలు & విక్రయాల అధికారిక వివరాలు: జిల్లాలో సాగు అవసరాలకు అనుగుణంగా ఇప్పటి వరకు 34,675.394 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి జిల్లాలో 15,778.814 టన్నుల నిల్వలు ఉన్నాయి. గడిచిన నెల రోజుల్లో 18,896.58 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు చేరింది. జిల్లా వ్యాప్తంగా జూన్ 8వ తేదీ నుండి ఏపీ ఏఐఎంఎస్ యాప్ ద్వారా ఇప్పటివరకు 56,275 మంది రైతులకు 17,321.67 మీ యూరియా విజయవంతంగా విక్రయించడమైనది. ఈ నిల్వలను జిల్లా వ్యాప్తంగా అన్ని రైతు సేవా కేంద్రాలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు మార్క్‌ఫెడ్ గూడౌన్లు మరియు గుర్తింపు పొందిన ప్రైవేట్ రిటైల్ డీలర్ల వద్ద అందుబాటులో ఉంచబడ్డాయి.

రైతులకు ముఖ్య సూచనలు:

ధర పరిశీలన: ఎరువులు కొనుగోలు చేసేటప్పుడు బస్తాపై ముద్రించిన గరిష్ట చిల్లర ధరను తప్పకుండా పరిశీలించాలి. నిర్ణీత ధర కంటే ఒక్క రూపాయి కూడా అదనంగా చెల్లించరాదు.

రశీదు పొందాలి: కొనుగోలు చేసిన ప్రతిసారీ అధికారిక డీలర్ నుండి తప్పనిసరిగా పాయింట్ ఆఫ్ సేల్ మెషిన్ ద్వారా వచ్చే రశీదును అడిగి పొందాలి.

బ్లాక్ మార్కెట్ మరియు అక్రమ విక్రయాలపై కఠిన హెచ్చరిక: జిల్లాలో ఎవరైనా డీలర్లు లేదా వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించినా, ఎంఆర్‌పి ధరల కంటే ఎక్కువ ధరకు విక్రయించినా, లేదా యూరియా నిల్వలను అక్రమంగా వేరే ప్రాంతాలకు మళ్లించినా సహించేది లేదని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తీవ్రంగా హెచ్చరించారు. అటువంటి అక్రమాలకు పాల్పడే వారిపై ఎరువుల నియంత్రణ చట్టం - 1985 చట్టం ప్రకారం కఠిన చట్టపరమైన క్రిమినల్ చర్యలు తీసుకోవడమే కాకుండా, వారి వ్యాపార లైసెన్సులను తక్షణమే రద్దు చేస్తామని కలెక్టర్ ఆదేశించారు.

క్షేత్రస్థాయిలో నిరంతరం తనిఖీలు చేపట్టేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

## ఆషాడ మాస ఉత్సవాల ఏర్పాట్లు పరిశీలించిన డిఎస్పీ



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** ఈ నెల 14వ తేదీనుంచి జరగనున్న పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి ఆషాడ మాస ఉత్సవాల ఏర్పాట్లను పెద్దాపురం డిఎస్పీ ఎబిజి తిలక్ శనివారం పరిశీలించారు. మరిడమ్మ ఉత్సవాలకు దూర ప్రాంతాల నుంచి సైతం భారీ సంఖ్యలో భక్తులు తరలి వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆలయ కార్యని ర్వాహణాధికారిణి కె విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతుండగా వాటిని డిఎస్పీ పరిశీలించారు. ఆలయం వద్ద చేపడుతున్న భక్తుల క్యూ లైన్‌లు, భక్తులకు త్రాగునీరు, ఎండకు, వానకు ఇబ్బంది కలగకుండా ఏర్పాటు చేసే రక్షణ చర్యలు, పారిశుధ్యం, విద్యుత్ సదుపా యాలు వంటి అంశాలపై ఆలయ అధికారులతో ఆయన చర్చించారు. ఉత్సవాలకు అవసరమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటుకు సిద్ధం చేస్తున్నట్టు ఆయన చెప్పారు.

rajadhanivartalu.com

మంగళవారం, 14 - 7 - 2026

# సంపాదకీయం

## ఆర్టీసీ బస్సులు: జీబ్రా క్రాసింగ్‌ల వద్ద ప్రాణాంతకమైన ముప్పు!

రోడ్డు భద్రత అనేది కేవలం ఒక నినాదం కాదు, అది భారతదేశం అంతటా ప్రతి ఒక్కరి ప్రాణాలకు సంబంధించిన ఒక ప్రాథమిక బాధ్యత. అయితే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్‌ఆర్టీసీ) బస్సుల నడిపే తీరును గమనిస్తే, ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చడం కంటే, రోడ్లపై భయానక వాతావరణాన్ని సృష్టించడానికే అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లుగా కనిపిస్తోంది. ముఖ్యంగా నగర, పట్టణ కూడళ్లలో, పాదచారుల కోసం కేటాయించిన జీబ్రా క్రాసింగ్‌ల వద్ద ఆర్టీసీ డ్రైవర్లు ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల విజయవాడలో జరిగిన ఒక సంఘటన దీనికి ప్రధాన ఉదాహరణగా నిలుస్తుంది. జీబ్రా క్రాసింగ్‌ల వద్ద పాదచారులకు ప్రాధాన్యత ఇవ్వడం ఒక ప్రాథమిక ట్రాఫిక్ నియమం. వాహనాలు వేగాన్ని తగ్గించాలి లేదా పూర్తిగా ఆగిపోవాలి. అయినప్పటికీ, మన ఆర్టీసీ డ్రైవర్లు జీబ్రా క్రాసింగ్‌లను రేస్ ట్రాక్‌ల వలె భావిస్తున్నట్లు అనిపిస్తోంది. సిగ్నల్ మారడానికి కొద్ది క్షణాల ముందు వేగాన్ని పెంచడం, పాదచారులు స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ వారిని భయపెట్టడానికి హారన్లు మోగించడం సర్వసాధారణమైపోయింది. నేటి యువత (జెన్ జెడ్) తమ మొబైల్ ఫోన్లలో మునిగిపోవడం, ఈ నిర్లక్ష్యపు డ్రైవింగ్ కలయిక మన రోడ్లను మృత్యుపాశాలుగా మారుస్తోంది. కేవలం షెడ్యూళ్లను పాటించడానికో లేదా సేవా లక్ష్యాలను చేరుకోవడానికో అమాయక పాదచారుల ప్రాణాలతో జూదం ఆడటం సమర్థనీయమేనా? ప్రైవేట్ వాహనదారులకు ఆదర్శంగా నిలవాల్సిన ఒక ప్రజా రవాణా సంస్థ ఇంత బాధ్యతారహితంగా ప్రవర్తిస్తే, సామాన్య పౌరుడు భద్రతను ఎక్కడ పొందగలడు?

**ఏపీఎస్‌ఆర్టీసీ తీసుకోవాల్సిన తక్షణ చర్యలు**

కఠినమైన శిక్షణ మరియు అవగాహన: ప్రతి ఆర్టీసీ డ్రైవర్‌కు పాదచారుల హక్కులు, జీబ్రా క్రాసింగ్ నిబంధనలపై ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించాలి.

ట్రాఫిక్ నిబంధనల అమలు: నిర్లక్ష్యంగా జీబ్రా క్రాసింగ్‌లను దాటే బస్సులపై ట్రాఫిక్ పోలీసులు భారీ జరిమానాలు విధించాలి. ఇందులో పాలుపడిన డ్రైవర్లపై ఆర్టీసీ అంతర్గత క్రమశిక్షణా చర్యలు ప్రారంభించాలి.

సాంకేతిక పరిజ్ఞాన వినియోగం: బస్సులలోని స్పీడ్ గన్‌లను మరింత సమర్థవంతంగా పర్యవేక్షించాలి, నిబంధనలను ఉల్లంఘించే బస్సులను గుర్తించడానికి కూడళ్ల నుండి సీసీటీవీ డేటాను ఆర్టీసీ నిర్వహణ వ్యవస్థలతో అనుసంధానించాలి.

'స్టాప్ సైన్' సంకేతాల అమలు: పాదచారులు, ఆర్టీసీ బస్సుల కోసం ప్రతి జీబ్రా క్రాసింగ్ వద్ద 'ఆగండి' సంకేతాలను ఏర్పాటు చేయాలి. ఈ సంకేతాల వద్ద 10 సెకన్ల పాటు ఆగాలనే నియమాన్ని తప్పనిసరిగా అమలు చేయాలి. అలా చేయని పక్షంలో, వారిని గుర్తించి భారీగా జరిమానా విధించాలి. రవాణా సంస్థకు ఆదాయం ముఖ్యమే కావచ్చు, కానీ అది మానవ ప్రాణాల కంటే విలువైనది ఎంతమాత్రం కాదు. రోడ్లపై నెలకొన్న ఈ ప్రాణాంతక ముప్పును అరికట్టేందుకు ఆర్టీసీ యాజమాన్యం, ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. కేవలం ప్రయాణం మాత్రమే కాకుండా, రోడ్డు దాటడం కూడా అంతే సురక్షితంగా ఉన్నప్పుడే నిజమైన పురోగతి సాధ్యమవుతుంది.

## వేతనాలు పెంచాలని అంగన్వాడీల కలెక్టరేట్ ముట్టడి




**కాకినాడ, (రాజధాని వార్తలు):** అంగన్వాడీల జాతీయ కోర్కెల దినోత్సవం సందర్భంగా ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు అనుబంధం ఆధ్వర్యంలో కాకినాడ కలెక్టరేట్ ముట్టడి నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీలకు కనీస వేతనం 26 వేలు చెల్లించాలని, కూటమి ప్రభుత్వ హామీ మేరకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అంగన్వాడీలకు అమలు చేయాలని, హెల్త్ డిపార్ట్మెంట్ నవచేతన యాప్ పని అంగన్వాడీల చేత చేయించడాన్నీ మానుకోవాలని, అంగన్వాడీలకు పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ ఇవ్వాలని ధర్నాకు హాజరైన ఐసిడిఎస్ పిడి చెరుకూరి లక్ష్మీకి వినతిపత్రం అందించారు. వర్షంలో కూడా ధర్నా అనంతరం పిఠాపురం రాజాగారి సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దడాల పద్మ, ఏరుబండి చంద్రావతి, సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దువ్వ శేషాబాబ్జి, చెక్కల రాజ్ కుమార్ మాట్లాడుతూ అంగన్వాడీలకు వేతనాలు పెంచుతామని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చెప్పి 11 ఏళ్ళు గడుస్తున్నా ఒక్క రూపాయి పెంచలేదని, రాష్ట్రంలో వేతనం పెంచి 7 సంవత్సరాలు గడుస్తుందని, ఈ కాలంలో నిత్యవసర సరుకులు ధరలు, ఇంటి అద్దెలు, గ్యాస్, కరెంట్ బిల్లులు వందల రెట్లు పెంచారని విమర్శించారు. ఇచ్చే ఏడువేల జీవితంలో సెంటరు అద్దెల నిర్వహణకై పెట్టుబడులు పెట్టడానికే సరిపోతుందన్నారు. రాజకీయ వత్తిళ్లతో తొలగించిన పెద్దాపురం వర్కర్ ఉద్యోగాన్ని తిరిగి ఇవ్వాలని రాష్ట్ర హైకోర్టు ఆదేశంపై జిల్లా శిశుసంక్షేమ అధికారులు నిర్లక్ష్యం వహించడాన్ని తప్పు పట్టారు. పోరాడి సాధించుకున్న గ్రాడ్యుటి అమలును జిల్లా అధికారులు నిబంధనల పేరుతో, అపాయింట్మెంట్ ఆర్డర్లు లేవనే సాకుతో కార్మికులకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు.

# అక్రమంగా కాలిన నోట్ల కట్టలు బయటపడ్డ జస్టిస్ యశ్వంత్ వర్మపై ఎఫ్ఐఆర్ నమోదు చేయండి

## - రాష్ట్రపతి, చీఫ్ జస్టిస్ స్పందించండి : విదసం డిమాండ్




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** డిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి యశ్వంత్ వర్మ ఇంట్లో కాలిని కరెన్సీ కట్టలు పై ఘటనపై కే వీరాస్వామి జడ్జిమెంట్ ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని, సిపి గ్రామ్స్ పిర్యాదు పై రాష్ట్రపతి, చీఫ్ జస్టిస్ తక్షణమే స్పందించాలని విదసం (విస్తృత దళిత సంఘాల) ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకట రావు డిమాండు చేసారు. విశాఖ అంబేద్కర్ భవన్‌లో జరిగిన పత్రికా ప్రతినిధుల సమావేశంలో వెంకటరావు మాట్లాడుతూ దేశంలో అత్యున్నత రాజ్యాంగ రక్షకులైన రాష్ట్ర పతి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి అతి ముఖ్యమైన సంచలన అవినీతి కేసుపై సామాన్యులు పిర్యాదు చేస్తే కింది స్థాయి అధికారులు కనీసం చదవకుండా పిర్యాదు మూసేస్తే ధర్మం నిలుస్తుందా అని ప్రశ్నించారు. గత ఏడాది మార్చి నెలలో డిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి యశ్వంత్ వర్మ ఇంట్లో దొరికిన సగం కాలిన అక్రమ నగదు పై విచారణకు, దర్యాప్తుకు అనేక చట్టపరమైన అడ్డంకులు ఎదురయ్యాయని, సిటింగ్ న్యాయ మూర్తిపై చర్యలు తీసుకోవడానికి ప్రధాన న్యాయమూర్తి అనుమతి అవసరం అని ప్రభుత్వం ఆయన చర్యలు తీసుకోలేదని వెంకటరావు గుర్తు చేశారు. ఎట్టకేలకు పార్లమెంటు అభిశంసనకు ప్రభుత్వం ఉపక్రమించిన నేపద్యంలో ఏప్రిల్ 9 న యశ్వంత్ వర్మ తన పదవికి రాజీనామా చేశారన్నారు. అవినీతిపై దర్యాప్తు నుండి రక్షణ కలిగిన ఉన్నత స్థాయి సిటింగ్ న్యాయ మూర్తి ఆ పదవికి రాజీనామా చేసిన వెంటనే అతడు సాధారణ పౌరుడేనని, అతనిపై దర్యాప్తుకు లేదా ఎఫ్ఐఆర్ నమోదుకు సిజెఐ అనుమతి అవసరం లేదని కే వీరాస్వామి v/s భారత ప్రభుత్వం 1991 తీర్పు స్పష్టం చేసిందన్నారు. ఈ తీర్పు ప్రకారం మాజీ న్యాయమూర్తి యశ్వంత్ వర్మపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని రెండు నెలల క్రితం రాష్ట్రపతికి, చీఫ్ జస్టిస్‌కి విదసం పిర్యాదు చేసిందన్నారు. సంచలనమైన కేసులో ఉన్నత రాజ్యాంగ వ్యవస్థలకు ఒక గుర్తింపు కలిగిన సంఘం పిర్యాదు చేస్తే తప్పుడు పద్ధతిలో మా పిర్యాదులు మూసివేశారని వెంకట రావు ఆవేదన వ్యక్తం చేసారు. యశ్వంత్ వర్మ రాజీనామా చేసిన ఉత్తరం జతపరిచి పిర్యాదు చేస్తే రాష్ట్రపతి, ప్రధాని కార్యాలయంలో ఉన్న ఐఏఎస్ అధికారులు గుడ్డిగా సిటింగ్ న్యాయ మూర్తిపై విచారణకు ప్రధాన న్యాయమూర్తి అనుమతి అవసరం అని మా పిర్యాదును తిరస్కరించడం అత్యంత నిర్లక్ష్యం, లేదా నిందితుడితో కుమ్మక్కవడం అని ఆరోపించారు. దీనిపై రాష్ట్రపతి, ప్రధాన న్యాయమూర్తి స్పందించి మాజీ న్యాయమూర్తి యశ్వంత్ వర్మపై ఎఫ్ఐఆర్ నమోదు చేసేలా ఆదేశించాలని, ఎన్ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్, సిబిఐ, ఎసిబిలు కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బస్తాలు బస్తాలు నోట్ల కట్టలు కలిగి ఉన్న మాజీ న్యాయమూర్తి యశ్వంత్ వర్మ పై చర్యలు తీసుకోరా? విచారించరా? సిటింగ్ న్యాయ మూర్తి అంటూ రాజ్యాంగ రక్షణ కల్పిస్తారా? ఇది ధర్మమా? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. ముమ్మాటికి తప్పు రాష్ట్రపతి, ప్రధాన న్యాయమూర్తి స్పందించండి యశ్వంత్ వర్మ పై ఎఫ్ఐఆర్ నమోదుకు ఆదేశించండి అంటూ ఆవేదనతో విదసం విజ్ఞప్తి చేస్తుందన్నారు. గుడివాడ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ జిల్లాల నుండి విదసం రాష్ట్ర నాయకులు విశాఖ నుండి గుడివాడ ప్రసాద్, బూల భాస్కర రావు, శ్రీకాకుళం నుండి ఎడ్ల గోపి, అనకాపల్లి నుండి ఫ్రాన్సిస్, మట్ల అప్పారావు, అమలాపురం నుండి గుబ్బల శ్రీనివాసరావు, కాకినాడ నుండి ఉభా చిన్ని గోదు వెంకటేశ్వర రావు, గుడివాడ భాస్కర రావు, బొకర మోహన్ రావు, కాళ్ల చిన్నా రావు, రేవిడి కృష్ణ, జీ. తాత బాబు, సబ్బవరపు. శ్రీనివాసరావు, బి. ఉమా మహేశ్వరి, గురుదేవి, పి. భాస్కర రావు, తదితరులు పాల్గొన్నారు.

# హెచ్‌పీవీ వ్యాక్సిన్‌తోనే మహిళల్లో సర్వైకల్ క్యాన్సర్ నియంత్రణ : సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** మహిళల్లో సర్వైకల్ క్యాన్సర్ నియంత్రణకు హ్యూమన్ పాపిలోమా వైరస్‌కు సంబంధించిన వ్యాక్సిన్ వేయడం ద్వారానే ఉపయుక్తంగా ఉంటుందని పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ తెలిపారు. నాట్కో ట్రస్ట్, లయన్స్ క్లబ్ ఆఫ్ వైజాగ్ చాప్టర్, చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థలు సంయుక్తంగా పోలీస్ బ్యారెక్స్‌లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 9 నుండి 14 ఏళ్ల లోపు బాలికలకు హెచ్ పి వి బూస్టర్ డోస్ వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని పోలీస్ కమిషనర్, చైతన్య స్రవంతి అధ్యక్షురాలు డాక్టర్ శిరీన్ రహమాన్ కలిసి ప్రారంభించారు. రెండు రోజులు పాటు జరిగే ఈ శిబిరంలో సుమారు 500 మంది పిల్లలకు వ్యాక్సిన్ వేయనున్నారు. ఈ సందర్భంగా సీపీ శంఖబ్రత బాగ్చీ మాట్లాడుతూ పోలీసు కుటుంబాలకు చెందిన బాలికలకు క్యాన్సర్ వ్యాక్సిన్ వేసేందుకు ముందుకొచ్చిన సంస్థలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ బూస్టర్ డోసు ద్వారా జ్వరం వచ్చినట్లయితే డాక్టర్ శిరీన్ రహమాన్‌ను సంప్రదించాలని సూచించారు. మొదటి డోసు వేసిన తర్వాత ఎటువంటి ఇబ్బందులు రానందున ఈ విడత కూడా బాలికలకు సమస్య ఉండదని స్పష్టం చేశారు. ఈ డోస్ వేయడంతో బాలికలు పెరిగి పెద్దయ్యాక కూడా గర్భాశయం ముఖద్వారా క్యాన్సర్ వచ్చే ప్రమాదం లేదని కమిషనర్ తెలిపారు. చైతన్య స్రవంతి అధ్యక్షులు




డాక్టర్ శిరీన్ రహమాన్ మాట్లాడుతూ 9 నుండి 14 ఏళ్లలోపున్న బాలికలకు రెండు డోసులు, ఆ పై వయసు గల వారైతే మూడు డోసులు వేసుకోవాలని చెప్పారు. పోలీసు కుటుంబాలలోని మహిళల్లో బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు అక్టోబర్లో ఒక శిబిరం ఏర్పాటు చేయమని పోలీస్ కమిషనర్, ఆమెను కోరారు. సర్వయి కల్ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్ రెండు ప్రమాదకరమైనవని, వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డిసిపి పాపారావు, ఏ డి సి పి అడ్మిన్ రామచంద్రరావు, లైన్స్ క్లబ్ కార్యదర్శి బి రవిచంద్ర, డాక్టర్ సత్యవేణి, ఉపాధ్యక్షులు విజయ్ శేఖర్, తనయుడు అవినీస్, తదితరులు పాల్గొన్నారు.


# పోలీసుల అవగాహన కార్యక్రమం

**రేణిగుంట, (రాజధాని వార్తలు):** తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్., ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా రహ దారి భద్రత, ట్రాఫిక్ నియమాల అమలు, ప్రజా భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలను పోలీసులు నిర్వహించారు. ప్రజల్లో ట్రాఫిక్ క్రమశిక్షణ పెంపొందించడం, రోడ్డు ప్రమాదాలను నివారించడం, సురక్షిత ప్రయాణాన్ని ప్రోత్సహించడం ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశ్యం. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం రద్దీని దృష్టిలో ఉంచుకుని రేణిగుంట బస్ స్టాండ్‌లో ఆటో డ్రైవర్లు, ప్రయాణికులతో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బస్ స్టాండ్ పరిసరాల్లో అధిక రద్దీ కారణంగా అప్రమత్తంగా వ్యవహరించాలని, ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని, ప్రజా భద్రతకు సహకరించాలని పోలీసులు సూచించారు. ఆటో డ్రైవర్లు విధి నిర్వహణ సమయంలో తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని, చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికేట్, పర్మిట్‌తో పాటు అన్ని తప్పనిసరి వాహన పత్రాలను తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడపరాదని,




అధిక వేగం, నిర్లక్ష్య డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని హెచ్చరించారు. ప్రయాణికుల భద్రతను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని, ఆటోల్లో నిర్ణీత సంఖ్యకు మించి ప్రయాణికులను ఎక్కించకుండా, సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని ఆటో డ్రైవర్లకు సూచించారు. ప్రయాణికులు కూడా ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల సహకారంతోనే సురక్షిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని, రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని తిరుపతి జిల్లా పోలీసులు పునరుద్ఘాటించారు.

# జాతర మహోత్సవాలపై సహకరించాలి : సమీక్షా సమావేశంలో డిఎస్పీ



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** ఆషాఢ మాసం సందర్భంగా నిర్వహించనున్న మరిడమ్మ జాతర మహోత్సవాల ఏర్పాట్లపై పెద్దాపురం సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. పెద్దాపురం డీఎస్పీ ఏబీజి తిలక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి ఆలయ అధికారులు, జాతర కమిటీ సభ్యులు హాజరయ్యారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, క్యూలైన్ల నిర్వహణ, పారిశుద్ధ్య ఏర్పాట్లు తదితర అంశాలపై డీఎస్పీ తిలక్ చర్చించారు. జాతర విజయవంతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖకు సహకరించాలని కమిటీ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ వైఆర్కె శ్రీనివాస్, ఎస్సై పాపారావు పాల్గొని జాతర ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని, సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# రాజకీయ లబ్ధి కోసం మత విద్వేషాలు రెచ్చగొట్టొద్దు : మెండు గోవిందు



**కరప, (రాజధాని వార్తలు):** రాజకీయ ప్రయోజనాల కోసం మతాల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నాలు చేయవద్దని జనసేన పార్టీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఏలూరులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన జడ శ్రవణ్ ఆధ్వర్యంలో దళితులు, క్రైస్తవుల సంక్షేమం పేరిట నిర్వహించిన సభలో సంక్షేమ అంశాలపై చర్చించకుండా, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై వ్యక్తిగత విమర్శలు చేయడం బాధాకరమని వారు పేర్కొన్నారు. క్రైస్తవ మతం ప్రేమ, శాంతి, సహనాన్ని బోధిస్తుందని, అలాంటి విలువలకు విరుద్ధంగా రాజకీయ ప్రసంగాలు చేయడం సరికాదన్నారు. రాష్ట్రంలో హిందువులు, క్రైస్తవులు, ఇతర మతాల ప్రజలు ఎన్నో ఏళ్లుగా పరస్పర గౌరవంతో, సోదరభావంతో కలిసి జీవిస్తున్నారని, వారి మధ్య రాజకీయ ప్రయోజనాల కోసం చిచ్చు పెట్టే ప్రయత్నాలు చేయకూడదని సూచించారు. దళిత క్రైస్తవులకు రిజర్వేషన్ల అంశం సుప్రీం కోర్టు పరిధిలో ఉన్న విషయమని, దానిని రాజకీయ ప్రచారానికి ఉపయోగించడం సమం జసం కాదని అభిప్రాయపడ్డారు. మత, కుల విభేదాలను రెచ్చగొట్టి కూటమి ప్రభుత్వాన్ని అస్థిరపరచాలనే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో శాంతి, సామరస్యం, సామాజిక ఐక్యతను కాపాడాల్సిన బాధ్యత ప్రతి రాజకీయ పార్టీపై ఉందని, ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలకు దూరంగా ఉండాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కరప మండల జనసేన పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు మెండు గోవిందు, యాదల రామకృష్ణ, మోకాన అశోక్ కుమార్, యండమూరి మాజీ సర్పంచ్ మారెళ్ళ శివ, జిల్లా సివిల్ సప్లై మెంబర్ చెప్పరా ఇమ్మాన్యూలు, జిల్లెల్ల ప్రసాద్, జంపల రమణ, పులిడిండి రాజు, దడల చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# సర్ సర్వేపై ఆర్డీవో పరిశీలన




**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం నియోజకవర్గంలో జరుగుతున్న సర్ సర్వే కార్యక్రమాలను పెద్దాపురం ఆర్డీవో కృష్ణ మూర్తి పరిశీలించారు. పెద్దాపురం మండలంలోని జి.రాగంపేట, వడ్లమూరు, పులిమేరు, దివిలి, సీఎం పల్లి, తాటిపర్తి, తిరుపతి, మార్లవ, కట్టమూరు గ్రామాలతో పాటు సామర్లకోట మండలంలోని వి కేర్ రాయపురం, మాధవపట్నం, అచ్చంపేట, గొంచాల, ఉండూరు గ్రామాల్లో ఆయన విస్తృతంగా పర్యటించి క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్ సర్వే కార్యక్రమం తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు సంబంధిత సిబ్బందితో మాట్లాడుతూ కార్యక్రమం పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని సూచించారు. అలాగే సార్ కార్యక్ర మాన్ని గడువులోపు వేగంగా పూర్తి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమాల్లో పంచాయితీల కార్యదర్శులు, సిబ్బంది, పాల్గొన్నారు.

# బాహుబలి 3 వస్తుందా? నిర్మాత మౌనం దేనికి సంకేతం?



బాహుబలి3 ఎప్పుడు వస్తుంది? గత కొన్ని సంవత్సరాలుగా భారతీయ సినీ అభిమానులు అత్యధికంగా అడుగుతున్న ప్రశ్నల్లో ఇదొకటి. దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కించిన బాహుబలి ఫ్రాంచైజీ భారతీయ సినీ చరిత్రలో కొత్త అధ్యాయాన్ని రాసిన తర్వాత మూడో భాగంపై ఊహాగానాలు ఎప్పుడూ ఆగలేదు. తాజాగా జరిగిన ఓ విషయం ఈ డిస్కషన్ ను మరోసారి హాట్ టాపిక్‌గా మార్చింది. రీసెంట్‌గా జరిగిన ఓ మూవీ టీజర్ లాంచ్ కార్యక్రమంలో నిర్మాత శోభు యార్లగడ్డ, రాజమౌళి కొడుకు కార్తికేయ పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాంకర్ సుమ డైరెక్ట్‌గా బాహుబలి3 షూటింగ్ ఎప్పుడు ప్రారంభమవుతుందని ప్రశ్నించారు. అయితే ఆ ప్రశ్నకు సమాధానం చెప్పకుండా స్టేజ్‌పై లైట్స్, సౌండ్ ఎఫెక్ట్స్‌తో సరదాగా సైలెంట్ మోమెంట్ క్రియేట్ చేయడం అక్కడున్న వారిని నవ్వించింది. కానీ ఆ మౌనం మాత్రం అభిమానుల్లో మరోసారి ఆసక్తిని పెంచింది. సమాధానం చెప్పకుండా దాటవేయడం వెనుక ఏదైనా ప్లానింగ్ ఉందా? లేక కేవలం సరదా కోసమే అలా చేశారా? అనే చర్చ సోషల్ మీడియాలో కొనసాగుతోంది. రీసెంట్‌గా నెట్‌ఫ్లిక్స్‌లో బాహుబలి: ది టార్చ్ బేరర్ డాక్యుమెంటరీను రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. ఈ డాక్యుమెంటరీలో ప్రభాస్, రానా దగ్గుబాటి, అనుష్క శెట్టి కలిసి పాల్గొన్న సంభాషణలో బాహుబలి ప్రపంచం ఇంకా కంటిన్యూ అవుతుందనేలా కామెంట్స్ చేశారు. ముఖ్యంగా సరదా సంభాషణ మధ్య ప్రభాస్ మూడు వేళ్లు చూపిస్తూ చేసిన సైగ, రానా చేసిన కామెంట్స్ అభిమానుల్లో మూడో భాగంపై కొత్త ఆశలను రేకెత్తించాయి. చివర్లో కనిపించిన ది లెగసీ కంటిన్యూస్ అనే మెసేజ్ కూడా డిస్కషన్‌కు మరింత ఊతమిచ్చింది. అయితే ఈ అన్ని పరిణామాల మధ్య ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. బాహుబలి3 పై ఆడియన్స్‌లో ఎంతటి ఉత్సాహం ఉన్నా, ఇప్పటి వరకు డైరెక్టర్ రాజమౌళి గానీ, నిర్మాత శోభు యార్లగడ్డ గానీ అఫీషియల్‌గా బాహుబలి మూడో భాగాన్ని అనౌన్స్ చేయలేదు. తాజాగా స్టేజ్ పైన కూడా ఈ ప్రశ్నకు నిర్మాత రెస్పాండ్ అవకుండా మౌనం పాటించడం కూడా పలు అనుమానాలకు దారి తీస్తోంది. ప్రస్తుతం రాజమౌళి తన తర్వాతి భారీ ప్రాజెక్టైన వారణాసితో బిజీగా ఉండగా, ప్రభాస్ కూడా వరుస పాన్ ఇండియా సినిమాల్లో నటిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో బాహుబలి3 ఎప్పుడు ప్రారంభమవుతుంది? అది ఫుల్ లెంగ్త్ సినిమా రూపంలో వస్తుందా? లేక ఫ్రాంచైజీని విస్తరించే మరో ప్రత్యేక ప్రాజెక్టుగా రూపుదిద్దుకుంటుందా? అన్న ప్రశ్నలకు సమాధానం రావాలంటే కచ్చితంగా అఫీషియల్ అనౌన్స్‌మెంట్ వచ్చే వరకు వేచి చూడాల్సిందే. అయితే ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది బాహుబలి పేరు వినిపించిన ప్రతిసారీ అభిమానుల్లో అదే ఉత్సాహం ఇప్పటికీ ఏమాత్రం తగ్గలేదు.

# తప్పు జరిగిపోయింది.. బహిరంగంగా ఒప్పుకుంటూ క్షమాపణలు చెప్పిన పృథ్వీ!



మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ నటించిన తాజా చిత్రం 'ఐ నో బడి' తెలుగులో ఆశించిన స్థాయిలో ప్రభావం చూపలేక పోయింది. 'సలార్' సినిమాతో మన దగ్గర మంచి క్రేజ్ తెచ్చుకున్న పృథ్వీ రాజ్, ఆ నమ్మకంతోనే ఈ సినిమాను నేరుగా తెలుగులో రిలీజ్ చేశారు. కానీ బ్రాండింగ్ లోపాలు, టైటిల్ కన్ఫ్యూజన్ వల్ల సినిమాకు థియేటర్లలో సరైన రెస్పాన్స్ రాలేదు. ఈ ప్రమోషన్ల ఫెయిల్యూర్స్‌పై పృథ్వీరాజ్ స్పందిస్తూ బహిరంగంగా క్షమాపణలు చెప్పారు. టైటిల్ కన్ఫ్యూజన్ పెద్ద మైనస్: ఈ సినిమాకు జరిగిన పెద్ద పొరపాటు టైటిల్ విషయంలోనే. ప్రమోషన్ల సమయంలో అంతా 'ఐ నో బడి' అని ప్రచారం చేశారు. కానీ థియేటర్లలోకి వెళ్లి స్క్రీన్ మీద చూస్తే 'ఐ ఎవరూ లేరు' అని కనిపించింది. ఇక ఇంగ్లీష్‌ను తెలుగులోకి సరిగ్గా ట్రాన్స్‌లేట్ చేయకపోవడం వల్ల వచ్చిన ఈ తేడాతో ఆడియన్స్ పూర్తిగా కన్ఫ్యూజ్ అయిపోయారు. జీరో పబ్లిసిటీ ఎఫెక్ట్: హీరో పృథ్వీరాజ్ స్వయంగా హైదరాబాద్ వచ్చి ప్రెస్ మీట్ పెట్టినప్పటికీ, గ్రౌండ్ లెవెల్‌లో మాత్రం పబ్లిసిటీ అసలు జరగలేదు. సినిమా ఎప్పుడు రిలీజ్ అయిందో కూడా చాలామంది జనాలకు తెలియలేదు. ఇక ప్రమోషన్స్ ఇంత వీక్‌గా ఉండటంతో బాక్సాఫీస్ వద్ద కనీస ఓపెనింగ్స్ కూడా రాలేదు. థియేటర్ల దగ్గర జనాలు లేక బీసీ సెంటర్లలో కొన్ని చోట్ల షోలు కూడా క్యాన్సిల్ అయ్యాయి. ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద 'లెనిన్' సినిమా హవా నడుస్తోంది. దీనికి తోడు ఇంగ్లీష్ డబ్బింగ్ మూవీ 'ఈవిల్ డెడ్ బర్న్', మరో డబ్బింగ్ సినిమా 'హృదయం మురళి' రేసులో ఉండటంతో 'ఐ నో బడి' కి థియేటర్లు దొరకడమే కష్టమైంది. పైగా మలయాళ కంటెంట్‌ను మన వాళ్లు ఓటీటీలో చూసేందుకే ఎక్కువ ఇష్టపడుతుండటంతో థియేటర్ల వైపు రాలేదు. తప్పు ఒప్పుకున్న పృథ్వీరాజ్: ఈ బ్రాండింగ్ తప్పులు, పబ్లిసిటీ ఫెయిల్యూర్స్ మీద హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ స్పందించారు. టైటిల్ ట్రాన్స్‌లేషన్ విషయంలో పెద్ద తప్పు జరిగిందని ఆయన ఓపెన్‌గా ఒప్పుకున్నారు. కేవలం ప్రెస్ మీట్ పెడితే సరిపోదని, గ్రౌండ్ లెవెల్ ప్రమోషన్స్ మిస్ అయ్యాయని చెప్తూ, ఈసారికి తనను క్షమించమని, నెక్స్ట్ టైమ్ ఇలాంటి తప్పులు జరగకుండా చూసుకుంటానని అభిమానులను కోరారు. ఒక మంచి సర్వైవల్ థ్రిల్లర్ కథతో వచ్చినప్పటికీ, కేవలం మార్కెటింగ్ లోపాల వల్లే ఈ సినిమా తెలుగులో వెనుకబడిపోయింది. ప్రస్తుతం 'వారణాసి' సినిమాలో విలన్‌గా నటిస్తూ తెలుగు మార్కెట్‌ను పెంచుకోవాలని చూస్తున్న పృథ్వీరాజ్.. ఈ సినిమా రిజల్ట్ నుంచి పాఠాలు నేర్చుకుని నెక్స్ట్ ప్రాజెక్ట్‌తో గట్టిగా కంబ్యాక్ ఇస్తారని ఆశిద్దాం..

# సమంతపై ఒత్తిడి ఈసారి ఇంకా కష్టం!



సమంత కెరీర్‌లో మా ఇంటి బంగారం విజయం మైలురాయిగా నిలిచిపోతుందన్నది కాదనలేని నిజం. ఈ లేడీ ఓరియేంటెడ్ చిత్రం బాక్సా ఫీస్ వద్ద వంద కోట్ల వసూళ్లను సాధించడంతో సమంత సత్తా మరోసారి చాటుకుంది. సోలో హీరోయిన్‌గా ఈ స్థాయి విజయాన్ని అందుకోవడం అంటే ఆమె తెలుగు చలనచిత్ర పరిశ్రమలో అగ్రశ్రేణి నాయికల సరసన స్థానాన్ని సుస్థిరం చేసుకోవడమే కాకుండా తనకంటూ బలమైన, ప్రత్యేకమైన మార్కెట్‌ను సృష్టించుకుందని చెప్పొచ్చు. అయితే ఈ విజయం సమంతపై ఓ కొత్త రకమైన ఒత్తిడిని తీసుకొస్తుందన్నది అంతే వాస్తవం. వంద కోట్ల క్లబ్‌లో చేరడం అంటే ఇకపై ప్రతి సినిమాకు అదే తరహా అంచనాలు ఉంటాయని అర్థం. ప్రేక్షకులు, నిర్మాతలు సామ్ నుండి మరింత ప్రతిభను, విభిన్నమైన కథలను ఆశిస్తారు. ఈ అంచనాలను నిలబెట్టుకోవాలనే ఒత్తిడి, ఏ నటికైనా సహజం. ఈ క్రమంలో సమంత తదుపరి ప్రాజెక్టుల ఎంపికలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఏర్పడింది. గతంలో సమంత ఎంచుకున్న ప్రయోగాత్మక చిత్రాలు అమ్మడికి మంచి గుర్తింపును తెచ్చిపెట్టాయి. కానీ ఇప్పుడు ఒక కమర్షియల్ స్టార్‌గా మారిన నేపథ్యంలో కథల ఎంపికలో సమతుల్యత పాటించడం సవాలుగా మారుతుందన్నది అంతే వాస్తవం. భారీ బడ్జెట్ సినిమాలతో పాటు నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలను ఎంచుకుంటూనే బాక్సాఫీస్ వద్ద నిలకడైన వసూళ్లను సాధించాల్సిన బాధ్యత సామపై ఉంది. ఒక్కో అడుగు ఆచితూచి వేయాల్సిన సమయం ఇది. ఎందుకంటే? సమంతను కోట్ల రూపాయలు నిర్మాత ఖర్చు చేస్తున్నప్పుడు ఆ నమ్మకాన్ని రెండింతలు నిలబెట్టాలి. కెరీర్ పరంగా సమంత వ్యక్తిగత నిర్ణయాలను కూడా మరింత బాధ్యతాయుతంగా తీసుకోవలసి ఉంది. గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా కథానాయికగా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును ఏర్పరచుకున్న సమంత ఈ విజయాన్ని అదృష్టంగా కాకుండా తన శ్రమకు దక్కిన ప్రతిఫలంగా భావిస్తోంది. ఈ క్రేజ్‌ను కొనసాగించడానికి తన ఫిట్‌నెస్, నటన, స్క్రిప్ట్ సెలక్షన్‌లో ఎప్పటికప్పుడు కొత్త మార్పులు చేస్తూనే ఉండాలి. ప్రస్తుత పోటీలో సమంత స్థానం సుస్థిరమైనదే అయినా? తదుపరి చిత్రాలు కూడా అదే స్థాయిలో ప్రేక్షకులను మెప్పించకపోతే? విమర్శలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. కాబట్టి సామ్ ఎంచుకునే కథలు కేవలం సోలో హీరోయిన్‌గా ఆమె ఇమేజ్‌ను పెంచేవిగానే కాకుండా? కంటెంట్ పరంగా కూడా బలంగా ఉండాలి. నిర్మాతలు ఆమెపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి ప్రతి చిత్రంలోనూ వంద శాతం ఎఫర్ట్ పెట్టాల్సిన అవసరం ఉంది. సమంతలో ఒత్తిడి ఆమెలోని నటిని మరింత మెరుగుపరుస్తుందని ఆశించొచ్చు. మా ఇంటి బంగారం విజయం ఆమెకు ఒక పునాది మాత్రమే. ఈ పునాది మీద సమంత భవిష్యత్తును ఎలా నిర్మించుకుంటుంది అన్నదే అందరిలోనూ ఉన్న ఆసక్తి. ఆచితూచి వేసే ప్రతి అడుగు సమంతను మరింత ఎత్తుకు తీసుకెళ్లాలని అభిమానులు కోరుకుంటున్నారు.

# బాలీవుడ్ విలన్లతో బాలయ్య చేస్తున్న గ్లోబల్ బాక్సాఫీస్ ప్రయోగం ఇదేనా?



టాలీవుడ్ సీనియర్ స్టార్స్ అనగానే ఒకప్పుడు కేవలం తెలుగు రాష్ట్రాల సరిహద్దులకే పరిమితమైన మార్కెట్ గుర్తొచ్చేది. కానీ, మారుతున్న నేటి పాన్-ఇండియా కాలంలో ఆ లెక్కలు పూర్తిగా మారుతున్నాయి. ముఖ్యంగా గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ తన సినిమాల్లో అనుసరిస్తున్న సరికొత్త కాస్టింగ్ స్ట్రాటజీ ఇప్పుడు ఇండస్ట్రీలో ఒక హాట్ ట్రెండ్‌గా మారింది. కేవలం లోకల్ విలన్లతో సరిపెట్టకుండా, బాలీవుడ్ అగ్రనటులను తన ప్రాజెక్టుల్లోకి దింపుతుం డటం వెనుక కేవలం ఒక కమర్షియల్ హంగు మాత్రమే లేదు... దీని వెనుక నార్త్ ఇండియా మార్కెట్‌ను సైలెంట్‌గా కొల్లగొట్టాలనే ఒక లోతైన ప్లాన్ దాగుంది అని టాక్ఆవిశేషాలు మీకోసం.. సాధారణం గా సౌత్ సినిమాలు నార్త్ బెల్ట్‌లో క్లిక్ అవ్వాలంటే భారీ విజువల్స్ లేదా మైథాలజీ సబ్జెక్టులు ఉండాలి అనుకుంటారు. కానీ బాలకృష్ణ రూట్ మార్చారు. 'భగవంత్ కేసరి'లో అర్జున్ రాంపాల్‌ను, మొన్నటి 'డాకు మహారాజ్'లో బాబీ డియోల్‌ను, ఇప్పుడు గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న లేటెస్ట్ మూవీ 'NBK111' లో సంజయ్ దత్‌ను విలన్లుగా పెట్టడం ద్వారా ఆయన హిందీ ఆడియన్స్‌కు నేరుగా కనెక్ట్ అవుతున్నారు. బాలీవుడ్ ప్రేక్షకులకు బాగా పరిచయమున్న ఈ స్టార్స్... బాలయ్యలాంటి పవర్‌ఫుల్ మాస్ హీరోతో తలపడుతుంటే చూసే క్రేజ్ నార్త్ మార్కెట్‌లో బిజినెస్ వాల్యూను, డిజిటల్ రైట్స్ ధరలను అమాంతం పెంచేస్తోంది. ఇక బాలకృష్ణ సినిమాలో విలన్ పాత్రలకు ఉండే వెయిటేజ్, వారి క్యారెక్టరైజేషన్లు చాలా బలంగా ఉండటం వల్లే అర్జున్ రాంపాల్, బాబీ డియోల్ లాంటి నటులు వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇప్పుడు సంజయ్ దత్ కూడా అదే బాటలో నడుస్తున్నారు. దీనివల్ల బాలీవుడ్ స్టార్స్‌కు సౌత్‌లో కొత్త మార్కెట్ దొరుకుతుంటే... బాలయ్య సినిమాలకు నార్త్ ఇండియాలో థియేట్రికల్ రీచ్ పెరుగుతోంది. ఇరుపక్షాలకూ లాభం చేకూర్చే పక్కా ప్లాన్ అని సమాచారం.

గతంలో బాలయ్య మార్క్ డైలాగులు, యాక్షన్ సీక్వెన్సులు కేవలం మన తెలుగు ఆడియన్స్‌కు మాత్రమే పూనకాలు తెప్పించేవి. కానీ బాలీవుడ్ విలన్ల ఎం ట్రీతో హిందీ డబ్బింగ్ సర్క్యూట్స్‌లో కూడా బాలయ్య సినిమా లకు విపరీతమైన వ్యూయర్‌షిప్ వస్తోంది. హిందీ ఆడియన్స్ కూడా ఈ 'లైన్ వర్సెస్ బాబా' లాంటి క్రేజీ కాంబినేషన్లను ఓపెన్‌గా యాక్సెప్ట్ చేస్తున్నారు అన్నది నిజం.

# 34వ వార్డులో శెట్టిబలిజ భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేసిన దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

### - ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చిన ఎమ్మెల్యే వంశీ





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** 34వ వార్డులో యాత, శెట్టిబలిజి సంక్షేమ సేవా సంఘం భవనానికి దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. యాతవీధిలో 14 లక్షలతో ఈ భవనానికి స్థానిక ప్రజలతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లా డుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రతి మాటను నెరవేరుస్తూ దక్షిణ నియోజకవర్గ రూపురేఖలు మార్చడమే కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. అదేవిధంగా ఎన్నో ఏళ్లగా శెట్టిబలిజి భవనం ఏర్పాటుకు ఎదురు చూస్తున్న స్థానిక ప్రజలు ఆకాంక్ష మేరకు ఈ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు వెల్లడించారు. కేవలం రెండు నెలలు లోపే ఈ భవనాన్ని ఆధునీకరణంగా నిర్మించి అందుబాటులో తీసుకు వస్తామని తెలి పారు. ఈ కార్యక్రమంలో సౌత్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ శివ



ప్రసాద్ రెడ్డి, వార్డు అధ్యక్షులు నీలం. రాజు, కూటమి నాయకులు, వీర మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.

# మార్గశిర మాసం ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించిన చైర్మన్ డాక్టర్ కందుల నాగరాజు







**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** శ్రీశ్రీశ్రీ కనకమహా లక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మార్గశిర మాసం సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని దేవస్థానం చైర్మన్ డాక్టర్ కందుల నాగరాజు తన కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దర్శన ఏర్పాట్లు, అన్నప్రసాదం, పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, క్యూలైన్ల నిర్వహణ, విద్యుత్, భద్రత తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం చైర్మన్ డాక్టర్ కందుల నాగరాజు దేవస్థానం పరిసర ప్రాంతాలను స్వయంగా సందర్శించి, జరుగుతున్న ఏర్పాట్లను ప్రత్యక్షంగా పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని పనులను సకాలంలో పూర్తి చేసి, మార్గశిర మాసం పొడవునా ఉత్తమ సేవలు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీకి ముందు అన్ని నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి : జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** అపార్ట్‌మెంట్‌కు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేసే ముందు తప్పనిసరిగా అన్ని అనుమతులు, ధ్రువపత్రాలు, సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ జీవీఎంసీ పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన జీవీఎంసీ పరిధిలోని మధురవాడ జోన్ పరదేశి పాలెంలో ఒక అపార్ట్ మెంట్‌ను సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలిం చారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ ఫైర్ సేఫ్టీ అనుమతి, స్ట్రక్చరల్ స్టెబిలిటీ సర్టిఫికెట్, ఆమోదిత భవన నిర్మాణ ప్రణాళిక, కంప్లీషన్ నోటీస్, లిఫ్ట్ ఇన్‌స్టాలేషన్ సర్టిఫికెట్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు తదితర పత్రాలు పూర్తిస్థాయిలో ఉన్నాయా లేదా అనే అంశాలను కమిషనర్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ పరిశీలనలో సోలార్ విద్యుత్ వ్యవస్థ, రైన్‌వాటర్ హార్వెస్టింగ్ వంటి తప్పనిసరి సదుపాయాలు పూర్తిస్థాయిలో ఏర్పాటు కాలేదని, ఈ అంశాలను సమగ్రంగా పరిశీలించి నివేదిక సమర్పించాలని అసిస్టెంట్ సిటీ ప్లానర్ శాస్త్రికి ఆదేశాలు జారీ చేశారు. అన్ని నిబంధనలు పూర్తి అయిన తర్వాతే తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో వ్యర్థాలు అధికంగా ఉన్నాయని వాటిని వెంటనే తొల గించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అపార్ట్‌మెంట్ నిర్వా హకులకు ఆదేశించారు. భవనంలో నివసించే వారి భద్రత, పరిశు భ్రత, పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ పరిశీలనలో జీవీఎంసీ అధికారులు, టౌన్ ప్లానింగ్ అధికారులు మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# రాజీ మార్గమే రాజమార్గం

### - జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్



**నెల్లూరు టౌన్, (రాజధాని వార్తలు):** వివాదాలను రాజీ మార్గంలో పరిష్కరించుకోవడం ద్వారా సమయం, ధనం ఆదా కావడంతో పాటు త్వరితగతిన న్యాయం పొందవచ్చని జిల్లా ప్రధాన న్యాయ మూర్తి శ్రీనివాస్ అన్నారు. శనివారం ఉదయం నగరంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్ర మాన్ని ఆయన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ.నందన్, అదనపు ఎస్పీ సౌజన్య తదిత రులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ, న్యాయస్థానాలపై కేసుల భారం అధికంగా ఉండటంతో అనేక కేసుల పరిష్కారానికి ఎక్కువ సమయం పడుతోందన్నారు. దీనివల్ల కక్షిదారులు సమయం, ధనం కోల్పోవాల్సి వస్తోందని, ఈ పరిస్థితిని అధిగమించేందుకే "రాజీ మార్గమే రాజమార్గం" అనే భావనతో నేషనల్ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండు పక్షాలు పరస్పర అంగీకారంతో రాజీకి వస్తే ఇద్దరికీ ప్రయోజనం చేకూరడంతో పాటు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. నెల్లూరు నగరపాలక సంస్థకు ఇళ్ల పన్ను, వ్యాపార పన్ను, నీటి పన్ను తదితరాల రూపంలో సుమారు రూ.100 కోట్ల బకాయిలు ఉన్నాయని పేర్కొన్న ఆయన, ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించిన ప్పుడే ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు అభివృద్ధి పనులు, ప్రజా సేవలను సమర్థవంతంగా అందించగల వని చెప్పారు. నేషనల్ లోక్ అదాలత్‌కు ముందు పంపిన నోటీ సులకు స్పందించి శుక్రవారం సాయంత్రానికే సుమారు రూ.1 కోటి పన్నుల బకాయిలు వసూలయ్యాయని వెల్లడించారు. మిగి లిన బకాయిదారులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడు తూ, ప్రత్యామ్నాయ వివాద పరిష్కార విధానం ప్రపంచ వ్యాప్తంగా విజయవంతంగా అమలవుతోందని, భారతదేశంలో కూడా ప్రజలు దీనిని ఎక్కువగా వినియోగించుకుంటున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నప్పటికీ, కుటుంబ, ఆస్తి, సివిల్ వివాదాల పరిష్కారం న్యాయవ్యవస్థ ద్వారానే సాధ్యమ వుతుందని తెలిపారు. అలాంటి వివాదాలకు లోక్ అదాలత్ అత్యంత సమర్థవంతమైన వేదికగా నిలుస్తోందన్నారు. రెండు పక్షాలు అంగీకారంతో ముందుకు వస్తే న్యాయస్థానం చట్టబద్ధత కల్పించి శాశ్వత పరిష్కారం అందిస్తుందని, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, చిన్న వివాదాలు కూడా లోక్ అదాలత్ ద్వారా పరిష్కారమైతే పోలీసు శాఖ, న్యాయస్థానాలపై ఉన్న పెండింగ్ కేసుల భారం తగ్గి కీలకమైన కేసులపై అధికారులు మరింత దృష్టి సారించే అవకాశం ఉంటుందని కలెక్టర్ వివరించారు. నగర పాలక సంస్థ కమిషనర్ వై.ఓ.నందన్ మాట్లాడుతూ, నగరం లో రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి పన్నులే ప్రధాన ఆదాయ వనరని తెలిపారు. పన్నులు చెల్లించడం ప్రతి పౌరుడి బాధ్యత అని, బకాయిదారులందరూ జాతీయ లోక్ అదాలత్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పన్నుల బకాయి లను చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. నగరాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మోటారు ప్రమాద పరిహార కేసులు, బ్యాంకుల వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కేసులు, బీఎస్ఎన్ ఎల్, మున్సి పల్ పన్నుల బకాయిలు, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, ఇతర రాజీకి వీలున్న కేసులను లోక్ అదాలత్ ద్వారా త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం ఉందని అధికారులు తెలి పారు. జాతీయ లోక్ అదాలత్ విజయవంతం కావడానికి సహకరిం చిన జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ, నగరపాలక సంస్థ, బ్యాంకులు, వివిధ ప్రభుత్వ శాఖలు, న్యాయవాదులు, బార్ అసోసి యేషన్ ప్రతినిధులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయాధికారులు, బ్యాంకుల ప్రతినిధులు, ప్రభుత్వ శాఖల అధికారులు, న్యాయ వాదులు, లోక్ అదాలత్, బార్ అసోసియేషన్ సభ్యులు, పెద్ద సంఖ్యలో కక్షిదారులు పాల్గొన్నారు.

# కోవూరు పోలీస్ స్టేషన్‌లో 'ప్రైవేట్ రాజ్యం'

### - నిజాలు నిర్భయంగా రాసిన జర్నలిస్టుపై దాడి యత్నం - పోలీసులకు ఫిర్యాదు చేసిన జర్నలిస్ట్‌లు



**కోవూరు, (రాజధాని వార్తలు):** నిజాలను నిర్భయంగా రాసిన జర్నలిస్ట్‌లకు రక్షణ లేక పోగా, దాడులు కూడ జరుగుతోందని కోవూరు పోలీస్ స్టేషన్‌లో ప్రముఖ జర్నలిస్ట్‌లు పిర్యాదు చేసారు. కోవూరు పోలీస్ స్టేషన్‌లో వ్యవహారాలు మరోసారిపురి విప్పడంతో వివాదాస్పదంగా మారాయి. గతంలో స్టేషన్‌లో ప్రైవేట్ వ్యక్తి ప్రభావం ఉందన్న ఆరోపణలు మళ్లీ వెలుగు చూసింది. అదే అంశంపై వార్తలు రాసిన జర్నలిస్టుపై దాడి యత్నం జరగడం తీవ్ర కలకలం రేపుతోందన్నారు. స్థానికుల ఆరోపణల ప్రకారం, కోవూరు పోలీస్ స్టేషన్ పరిధిలో గత దశాబ్దంగా 'పృద్వి' అనే ప్రైవేట్ వ్యక్తి ప్రభావం కొనసాగుతోందని చెబుతున్నారు. పోలీసుల పేరుతో అతను దుకాణదారులు, వాహనదారులను బెదిరిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నాడని, హైవేపై కారులో 'పోలీస్' బోర్డు పెట్టుకుని లారీలను ఆపి, మామూలు ఇవ్వని వాహనాలను స్టేషన్‌కు తీసుకెళ్లే ఘటనలు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తు న్నాయి. ఇంకా పోలీస్ యూనిఫామ్‌ను పోలిన దుస్తులు ధరించి ప్రజల్లో భయాందోళన సృష్టించడం, తనను ప్రశ్నించిన వారిపై బెదిరింపులకు దిగడం వంటి అంశాలు గతంలోనే వెలుగులోకి వచ్చి జిల్లా స్థాయిలో చర్చనీయాంశమయ్యాయి. ఇదే విషయంపై రెండు సంవత్సరాల క్రితం కథనాలు రాసిన ఎన్3 కోవూరు రిపోర్టర్‌ను లక్ష్యంగా చేసుకుని తాజాగా దాడి యత్నం జరగడం పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చింది. శుక్రవారం రాత్రి మద్యం మత్తులో వచ్చిన పృద్వి, జర్నలిస్టుపై బీరు బాటిల్ విసిరి, "నా మీద వార్తలు రాస్తావా... చంపేస్తా... నీ అంతు చూస్తా" అంటూ బెదిరించినట్లు బాధితుడు తెలిపారు. గతంలో ప్రచురి తమైన వార్తలను మనసులో పెట్టుకుని ఇప్పుడే ప్రతీకారం తీర్చుకునే ప్రయత్నం చేయడం గమనార్హమని స్థానికులు పేర్కొం టున్నారు. ఈ ఘటనపై కోవూరు జర్నలిస్టులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, బాధిత జర్నలిస్టుకు సంఘీభావం తెలిపారు. జూలై 12న కోవూరు జర్నలిస్టులు సమిష్టిగా పోలీసులకు ఫిర్యాదు చేసి, దాడి యత్నం చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల భద్రతపై ప్రభుత్వం, పోలీస్ శాఖ వెంటనే స్పందించాలని వారు కోరుతున్నారు. ఈ ఘటనతో కోవూరు పోలీస్ స్టేషన్‌పై మళ్లీ ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రైవేట్ వ్యక్తుల జోక్యం, పోలీస్ వ్యవస్థలో అలసత్వం వంటి అంశాలపై ఉన్న ఆరోపణలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి నిజానిజాలు బయటపెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# నిత్యం ప్రజాసేవకుడు, టీడీపీ నేత రఫీకి జన్మదిన శుభాకాంక్షలు



**కోవూరు, (రాజధాని వార్తలు):** పడుగుపాడు షాదీ మంజిల్ అభి వృద్ధి కమిటీ అధ్యక్షులు రఫి జన్మదిన శుభాకాంక్షలను అభిమానులు వెలువెత్తిన చెప్పారు. ఆయన అమూల్యమైన సమయాన్ని ప్రజా సేవకు అంకితం చేస్తూ, అందరికీ మార్గదర్శ కంగా నిలుస్తున్న రఫీ బాయికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపినారు. ఆయురారోగ్యాలతో ఉండి భవిష్యత్తులో ఇంకా ఎన్నో ఉన్నత పదవులు అలంకరించాలని టీడీపీ కూటమి నేతలు అభిమానులు ఆకాంక్షించారు. మీ జీవితంలో ఆనందం, ఆరోగ్యం, ఆయురారోగ్యం, ఐశ్వర్యం నిత్యం వెల్లివిరియాలని, మీరు ఆశించిన ప్రతి లక్ష్యం విజయవంతంగా సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము.

# విజయనగరంతో జానకికి విడదీయరాని బంధం





**విజయనగరం, (రాజధాని వార్తలు):** ప్రముఖ గాయని యస్. జానకికి విజయనగరంతో విడదీయలేని బంధం ఉంది. గతంలో ఆత్రేయ స్మారక కళాపీఠం ఆత్రేయ పురస్కారంతో జానకిని గౌరవించింది.

తాజాగా ప్రముఖ గాయకులు అభినవ ఘంటసాలగా పేరుగాంచిన బివి నారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఒక ప్రైవేటు కార్యక్రమానికి కూడా ఆమె హాజరయ్యారు. 2016లో ఘంటసాల సంగీత సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపకులు సముద్రాల గురు ప్రసాద్ ఎస్.జానకి సినీ జీవిత విశేషాలపై రాసిన కోకిలమ్మ పుస్తకాన్ని సమాఖ్య ఆధ్వర్యంలో ఆవిష్కరించారు.

# డిజిటలైజేషన్ కోసం బిఎల్ఓను సంప్రదించండి

**- అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ ఓటుహక్కు కల్పిస్తాం : జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి**





**విజయనగరం, (రాజధాని వార్తలు):** జిల్లాలో డిజిటలైజేషన్ ప్రక్రియ ముమ్మరంగా జరుగుతోందని, ఇప్పటివరకు సుమారు 85 శాతం పూర్తి అయ్యిందని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి తెలిపారు. తమ ఛాంబర్లో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, సర్ ప్రక్రియ పురోగతిని వివరించారు. జిల్లాలో 15,78,949 మంది ఓటర్లు ఉండగా, వీరిలో ఇప్పటివరకు 13,25,000 మందికి డిజిటలైజేషన్ పూర్తి అయ్యిందని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో డిజిటలైజేషన్‌లో కొన్ని ఇబ్బందులు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అందువల్ల ఎవరైనా మిగిలిపోయి ఉంటే, డిజిటలైజేషన్ ను పూర్తి చేసేందుకు వెంటనే తమ బిఎల్ఓను సంప్రదించాలని సూచించారు. ఈ నెల 14 లోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉందని, అందువల్ల ప్రజలు కూడా సిబ్బందికి తమవంతు సహకారాన్ని అందించాలని ఆయన కోరారు. ఎన్యూమరేషన్ ఫారాన్ని నింపి తమ ఆధార్ నంబరును నమోదు చేస్తే చాలని చెప్పారు. అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ ఓటుహక్కు కల్పించడం, డూప్లికేట్ ఓట్లను నివారించడం, ఖచ్చితమైన ఓటర్ల జాబితాను రూపొందించడమే లక్ష్యంగా సర్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించడం జరుగుతోందని చెప్పారు. అందువల్ల ఓటర్లు తమ ఆధార్ సంఖ్యను కూడా నమోదు చేయాలని సూచించారు. అలాగే ఒక కుటుంబ సభ్యుల ఓట్లన్నీ ఒకే పోలింగ్ కేంద్రంలోకి రావాలంటే, తప్పనిసరిగా వారంతా ఒకే డోర్ నెంబరును నమోదు చేయాల్సి ఉంటుందని చెప్పారు.

ఒక ఇంటిలో ఎవరైనా సభ్యులు ఉద్యోగ, ఉపాధి నిమిత్తం వేరే ప్రాంతానికి వలస వెళ్లిన పక్షంలో, వారి వివరాలను కుటుంబ సభ్యులు ఎవరైనా బిఎల్ఓలకు తెలియజేయవచ్చునని అన్నారు. 18 ఏళ్లు నిండినవారంతా కొత్తగా తమ పేర్లను ఓటర్ల జాబితాలో నమోదు చేసుకొనేందుకు ఫారమ్ 6 ద్వారా ధరఖాస్తు చేయాలని సూచించారు. డిజిటలైజేన్ పూర్తి అయిన అనంతరం ఈ నెల 21న ముసాయిదా జాబితాను ప్రచురించడం జరుగుతుందన్నారు. దీనిపై అభ్యంతరాలను ఆగస్టు 20 వరకు స్వీకరించి, ఆగస్టు 21 నుంచి సెప్టెంబరు 18 వరకు అభ్యంతరాలను పరిశీలించి, పరిష్కారం అనంతరం సెప్టెంబరు 22న ఓటర్ల తుది జాబితాను ప్రచురించడం జరుగుతుందని వివరించారు. ముసాయిదా జాబితాలో పేరు లేని ఓటర్లు, తమ బిఎల్ఓ లేదా తాహసీల్దార్, ఎంపిడిఓ, ఇఆర్ఓ కార్యాలయాన్ని సంప్రదించి తమ పేరును నమోదు చేసుకొనే అవకాశం ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు.

# సాయి గణేష్ నగల దుకాణంలో చోరీ

**- సి.ఐ ఎస్.సన్యాసినాయుడు, ఎస్.ఐ కే.కిరణ్ కుమార్ నాయుడు**





**గజపతినగరం, (రాజధాని వార్తలు):** గజపతినగరంలో జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న సాయి గణేష్ నగల దుకాణంలో శనివారం తెల్లవారుజామున నగలు దొంగతనం జరిగినట్లు సి.ఐ ఎస్.సన్యాసినాయుడు, ఎస్సై కే.కిరణ్ కుమార్ నాయుడు విలేకరులకు తెలియజేశారు. ఎస్సై కే కిరణ్ కుమార్ నాయుడు అందించిన సమాచారం ప్రకారం గజపతినగరం జాతీయ రహదారికి ఆనుకొని అపోలో మెడికల్ షాప్ పక్కన గల చెరుకుపల్లి బ్రహ్మారెడ్డి సన్ ఆఫ్ (గోవిందరెడ్డి)కి చెందిన సాయి గణేష్ నగల దుకాణం గోడకి రంధ్రం చేసి కొందరు బయట వ్యక్తులు ప్రవేశించారని ఎస్.ఐ కే కిరణ్ కుమార్ నాయుడు చెప్పారు. నగల దుకాణంలోకి ప్రవేశించిన వారు దుకాణం నుంచి ఆరు తులాల బంగారు ఆభరణాలు, కొద్దిపాటి వెండి వస్తువులను దొంగలించకపోయినట్లు ఎస్.ఐ కే.కిరణ్ కుమార్ నాయుడు చెప్పారు. సాయి గణేష్ బంగారు నగల దుకాణం యజమాని బ్రహ్మారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్.ఐ కే కిరణ్ కుమార్ నాయుడు తెలియజేశారు. దర్యాప్తులో భాగంగా ఆధారాల టీం సహాయం తీసుకుంటున్నట్లు ఎస్సై కిరణ్ కుమార్ నాయుడు తెలియజేశారు.

# బొజ్జల బృందమ్మ జన్మదిన వేడుకల్లో గాలి మురళి నాయుడు



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** తొట్టంబేడు మండల మాజీ టిడిపి అధ్యక్షులు గాలి మురళి నాయుడు మాజీ మంత్రి, దివంగత నేత బొజ్జల గోపాల కృష్ణారెడ్డి సతీమణి, ప్రస్తుత శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి తల్లిగారైన బొజ్జల బృందమ్మ జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ ఆయన సందర్భంగా ఊరందూరులోని వారి స్వగృహంలో బృందమ్మని దుశ్శాలువా, పండ్లతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మీరు నిండు నూరేళ్లు ఆరోగ్యంగా, ఆనందంగా, ఆర్థికంగా ఉండాలని, సుధీర్ రెడ్డికి సహాయ సహకారాలు అందిస్తూ, సలహాలు సూచనలు ఇవ్వాలని, పేద ప్రజలకు సేవ చేసే భాగ్యం కలగాలని శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీ కాళహస్తీశ్వర స్వామి వారి ఆశీస్సులు మెండుగా మీ కుటుంబానికి ఉండాలని మురళి నాయుడు కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ పాపి రెడ్డి, మాజీ జెడ్పిటిసి పేరం ధనంజయలు నాయుడు, మోహన్ నాయుడు, సింగిల్ విండో చైర్మన్ బత్తిరెడ్డి, మాజీ మార్కెటింగ్ చైర్మన్ జై చంద్ర నాయుడు, ఎస్సీ సెల్ నాయకుడు సాలి రాజ, బాలాజీ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల భద్రతే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**- 442 మందికి రాజముద్రతో కూడిన పట్టాదారు పుస్తకాలు పంపిణీ - ల్యాండ్ టైటిల్ యాక్ట్‌తో వైసీపీ ప్రభుత్వం మోసం : రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్**







**గజపతినగరం, (రాజధాని వార్తలు):** ప్రజల భద్రతే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సం బంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం నియోజకవర్గంలోని సాలిపేట గ్రామంలో 442 మందికి ప్రభుత్వ రాజముద్రలతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హక్కుదారులకు అందజేశారు. ఈ సందర్భంగా కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రీ సర్వే పేరుతో వైసీపీ ప్రభుత్వం అనేక అవకతవకలను చేసిందన్నారు. సాగు రైతులకు, సరిహద్దుదారులకు ఆఖరికి కుటుంబ సభ్యులకు సైతం గొడవలు సృష్టించి విధ్వంసం చేశారన్నారు. తాతల నుండి వచ్చిన ఆస్తులతో హక్కుదారులు ఒకరైతే, సాగులో మరొకరు ఉండటంతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందారన్నారు. రీ సర్వే నెపంతో గత ప్రభుత్వం గందరగోళం సృష్టించిన మోసాన్ని ముందే గమనించిన చంద్రబాబునాయుడు గారు హక్కుదారుడు ఫోటోతో రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలు అందించడం జరుగుతుందని ఎన్నికల హామీ ఇవ్వటం జరిగిందన్నారు. తాతల నుండి వచ్చిన ఆస్తికి సంబంధించిన ప్రభుత్వం నుంచి అందించే పాసు పుస్తకంపై నాటి ముఖ్యమంత్రి జగన్ ఫోటో చూసి ప్రజలు విస్మయం చెందారన్నారు. అలాగే 700 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి ఫోటోలతో సర్వే రాళ్లు వేయించిన మహా మోసగాడు జగన్ అన్నారు. రాజముద్రలతో పట్టాదారు పాస్ పుస్తకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన విధానానికి అద్దం పడుతుందన్నారు. గ్రామంలో ప్రతి ఒక్కరికి పాస్ పుస్తకం అందించేలా పనిచేసిన రెవెన్యూ సిబ్బందికి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అభినందనలు తెలిపారు. ఎన్నికల హామీలను అమలు పరుస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. తెలుగుదేశం పోలీస్ బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవి మాట్లాడుతూ గ్రామంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఒకేసారి హక్కుదారులందరికీ పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వడం శుభ పరిణామం అన్నారు. గ్రామస్తుల దశాబ్దాల కల నెరవేరిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పివివి గోపాలరాజు, కూటమి నాయకులు రెడ్డి పావని, దుగ్గా దేవుడు, భాస్కరరావు, రొంఖానా అరుణ, చిన్నం నాయుడు, బంగారు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ కళాకారుడు వెంకి నాయుడుకి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అభినందన

**గజపతినగరం, (రాజధాని వార్తలు):** గజపతినగరం మండలం సాలిపేట గ్రామానికి చెందిన సీనియర్ కళాకారుడు వెంకీ నాయుడుకి రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అభినందనలు తెలిపారు. శనివారం మంత్రి పర్యటనలో పట్టాదారు పుస్తకాలు పంపిణీ అనంతరం వెంకీ నాయుడు జానపద గేయాన్ని సభలో ఆలకించారు. ఈ సందర్భంగా కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాలలో అంతరించిపోతున్న జానపద కళలును, కోలాట, భజన కార్యక్రమాలను వెంకీ నాయుడు వంటి సీనియర్ కళాకారులు జీవం పోస్తున్నారన్నారు. సభలో ప్రజలను ఉత్తేజపరుస్తూ, ఉత్సాహపరుస్తూ వెంకి నాయుడు చేసిన గానం చాలా అలరించే విధంగా ఉందన్నారు. వెంకీ నాయుడును మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శాలువాతో సత్కరించారు. గ్రామస్తులంతా హర్షం వ్యక్తం చేశారు.



# పాపా రెడ్డి పురుషోత్తం రెడ్డిని పరామర్శించిన మాజీ ఎంపీ వరప్రసాదరావు

**- రాజారామిరెడ్డి మృతి పట్ల సంతాపం ప్రకటించిన మాజీ ఎంపీ వెలగపల్లి వరప్రసాదరావు**



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** తిరుపతి జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు పాపారెడ్డి పురుషోత్తం రెడ్డి తండ్రి పాపారెడ్డి రాజారామిరెడ్డి అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. రాజా రామిరెడ్డి మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ తిరుపతి పార్లమెంట్ సభ్యులు, మాజీ గూడూరు శాసనసభ్యులు వెలగపల్లి వరప్రసాదరావు, రాష్ట్ర బిజెపి ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డిలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి సంతాపం ప్రకటించారు. శనివారం జమీన్ కొత్తపాలెం గ్రామంలోని రాజారామిరెడ్డి నివాసానికి చేరుకున్న వరప్రసాదరావు, ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పాపా రెడ్డి పురుషోత్తం రెడ్డితో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజారామిరెడ్డి మృతి వారి కుటుంబానికి తీరని లోటని అన్నారు. ఆయన జీవితాంతం కుటుంబ విలువలకు, సమాజానికి చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని ఆ కుటుంబ సభ్యులకు భగవంతుడు ప్రసాదించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. మృతుని ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తు న్నట్లు వరప్రసాదరావు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొని రాజారామిరెడ్డికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు గిరి రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజ్, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మండడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎక్లాటెక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్స్ కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# భారత్ టెక్స్ 2026 : మోదీ 5 ఎఫ్ విజన్ సాకారం : శ్రీ పబిత్రా మార్గరీటా



కశ్మీరీ పష్మీనా ఇచ్చే అద్భుతమైన వెచ్చదనం నుంచి అస్సాంలోని ముగా సిల్క్ గంభీరమైన మెరుపు వరకు, శక్తివంతమైన రాజస్థానీ బంధానీ జ్యామితీయ నమూనాల నుంచి శాశ్వతమైన కాంచీవరం పట్టు, సుసంపన్నమైన శైలి వరకు, భారతదేశ భౌగోళిక మరియు సాంస్కృతిక వైవిధ్యం దారాలతో నేసిన ఒక సజీవమైన పటం. నేడు, ఈ అసమానమైన నాగరికతా ఒకే గొడుగు కిందికి వచ్చింది. జూలై 14 నుంచి 17 వరకు న్యూఢిల్లీలోని ప్రతిష్టాత్మక భారత్ మండపంలో 'భారత్ టెక్స్ 2026' ప్రారంభం, మన దేశంలోని అద్భుతమైన వైవిధ్యం ఒకే చోట ఆవిష్కృతమవుతోంది. వస్త్రాలు కేవలం మన వారసత్వ ప్రతిబింబం మాత్రమే కాదు; అవి భారతదేశ స్థూల ఆర్థిక నిర్మాణానికి ఒక బలమైన పునాది. జీడీపీకి 2.3%, పారిశ్రామిక ఉత్పత్తికి 13%, ఎగుమతులకు 8.6% సహకారం అందిస్తూ, ఈ రంగం వృద్ధి మరియు సమానత్వానికి ఒక భారీ ఇంజిన్‌గా నిలుస్తోంది. 10 కోట్లకు పైగా ప్రజలకు జీవనోపాధిని కల్పిస్తూ, వ్యవసాయం తర్వాత భారతదేశంలో రెండవ అతిపెద్ద ఉపాధి రంగంగా ఉంది. గ్రామీణ వర్గాలను బలోపేతం చేయడంతో పాటు దేశవ్యాప్తంగా లక్షలాది మంది మహిళల ఆర్థిక స్వయంప్రతిపత్తిని కల్పిస్తోంది. ఈ ఆర్థిక శక్తిని నిజంగా అభినందించాలంటే, భారత్ టెక్స్‌ను అనుభూతిని చెందాల్సిందే. తయారీ, సృజనాత్మకతలో మన పూర్తి ఆధిపత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా రూపొందించిన భారతదేశ అతిపెద్ద, ప్రపంచ స్థాయి వస్త్ర వాణిజ్య ప్రదర్శన ఇది. దేశీయ తయారీదారులు, రాష్ట్ర పెవిలియన్లు, అంతర్జాతీయ ప్రదర్శనదారులు, ప్రపంచ కొనుగోలుదారులను ఒకే చోటికి చేర్చే సమగ్ర మార్కెట్. దీని ద్వారా హై-వాల్యూ సోర్సింగ్, కార్పొరేట్ భాగస్వామ్యం, బ్రాండ్ ప్రదర్శన సాధ్యమవుతుంది. ఈ గొప్ప చౌరవ ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటే, భారత్ టెక్స్ మునుపటి రెండు ఎడిషన్లు తీసుకొచ్చిన అపారమైన గర్వం, స్పష్టత నాకు గుర్తుకొస్తున్నాయి. గత భారత్ టెక్స్ ఎడిషన్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వస్త్ర రంగాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ, మనం నాటిన విత్తనం నేడు మహా వృక్షంగా ఎదుగుతోందని అభివర్ణించారు. ఈ గొప్ప ప్రదర్శన మన గొప్ప సంప్రదాయాలను జరుపుకోవడమే కాకుండా, అభివృద్ధి చెందిన భారత్ యొక్క అపారమైన అవకాశాలను కూడా తెలియజేస్తోందని ఆయన పేర్కొన్నారు. భారీగా అంతర్జాతీయ కొనుగోలుదారులను ఆకర్షించి, సహకార వేగాన్ని పెంచిన మొదటి రెండు ఎడిషన్ల అద్భుతమైన విజయం ఒక బలమైన పునాదిని వేశాయి. 'భారత్ టెక్స్ 2025' సమయంలో నా వ్యక్తిగత అనుభవం ప్రకారం, ప్రభుత్వం-ప్రభుత్వం మరియు వ్యాపారం-ప్రభుత్వం మధ్య జరిగిన చర్చలు ఆచరణాత్మక ఫలితాలుగా మారి భవిష్యత్తుపై సానుకూల దృక్పథాన్ని ఇచ్చాయి. అలాగే భారతదేశ కార్యాచరణ సామర్థ్యాలపై ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న నమ్మకాన్ని నిరూపించింది. ఈ మూడవ ఎడిషన్ ఆ వేగాన్ని మరింత ముందుకు తీసుకెళ్తూ, గత సామర్థ్యాన్ని సంపూర్ణ పారిశ్రామిక ఆధిపత్యంగా మారుస్తుంది. ఈ సంవత్సర వేడుక స్థాయి ఒక అద్భుతమైన వ్యూహాత్మక పారిశ్రామిక ప్రణాళికను ప్రతిబింబిస్తుంది. భారత్ మండపంలోని ప్రత్యేక ప్రదర్శన హాళ్లలో విస్తరించి ఉన్న ఈ ఎగ్జిబిషన్.. ఫైబర్, యార్న్, ఫ్యాబ్రిక్, అపెరల్ అండ్ ఫ్యాషన్, హోమ్ టెక్స్‌టైల్స్, టెక్నికల్ టెక్స్‌టైల్స్, అనుబంధ పరిశ్రమలతో కూడిన భారతదేశ పూర్తి వస్త్ర విలువ గొలుసును ప్రదర్శిస్తుంది. ప్రధాన మంత్రి మోదీ యొక్క పరివర్తనాత్మక 5ఎఫ్ విజన్: ఫార్మ్ టు ఫైబర్ టు ఫ్యాక్టరీ టు ఫ్యాషన్ టు ఫారిన్ ను ప్రతిబింబిస్తూ, 1,600 పైగా ప్రదర్శనదారులు వారి ప్రాంతీయ ఉత్పత్తి సామర్థ్యాన్ని నేరుగా ప్రపంచ వేదికపైకి తీసుకువస్తున్నారు. మొత్తం విలువ గొలుసును ఒకే పారిశ్రామిక నిరంతర ప్రక్రియగా అనుసంధానించి, తయారీలోని ప్రతి దశను స్వదేశీంగా నిర్వహించగల భారతదేశ స్వయంసమృద్ధ సామర్థ్యాన్ని ఈ వేడుక ప్రదర్శిస్తుంది. ఈ ప్రతిపాదనకు ప్రపంచవ్యాప్తంగా లభించిన స్పందన అసాధారణమైనది. ఈ ఎడిషన్‌లో యునైటెడ్ స్టేట్స్, యునైటెడ్ కింగ్‌డమ్, జపాన్, పోర్చుగల్, స్పెయిన్, న్యూజిలాండ్, సౌత్ కొరియా, సౌత్ ఆఫ్రికా మరియు నేపాల్‌తో పాటుగా 14 దేశాల నుంచి అంతర్జాతీయ ప్రదర్శనదారులు పాల్గొంటున్నారు. వీరితో పాటు ఐక్యరాజ్యసమితి, యూరోపియన్ యూనియన్ నుంచి బలమైన ప్రాతినిధ్యం ఉంది. దీర్ఘకాలిక భాగస్వామ్యాలను అన్వేషించేందుకు అనేక దేశాల నుంచి మంత్రుల ప్రతినిధి బృందాలు, ఉన్నత స్థాయి వ్యాపార ప్రతినిధులు పాల్గొంటున్నారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ ప్రదర్శనలో ప్రదర్శించే 20,000 లకు పైగా వస్త్ర ఉత్పత్తులను సందర్శించేందుకు 110 కి పైగా నమోదిత దేశాల నుంచి 7,000 లకు పైగా కొనుగోలుదారులు, 1.3 లక్షల మంది వాణిజ్య సందర్శకులు వస్తారని భావిస్తున్నారు. ఈ వాణిజ్య కార్యకలాపాలకు తోడుగా 3,500 లకు పైగా బిజినెస్-టు-బిజినెస్ సమావేశాలు జరుగుతాయి. అలాగే వ్యక్తిగత భారతీయ రాష్ట్రాలు వారి ప్రత్యేక పారిశ్రామిక మౌలిక సదుపాయాలను ప్రదర్శించేందుకు ప్రత్యేక 'స్టేట్ ఇన్వెస్టర్ కనెక్ట్ సెషన్స్' ను కూడా నిర్వహిస్తారు. నిజమైన పారిశ్రామిక నాయకత్వానికి జ్ఞానం, భవిష్యత్తు ప్రణాళికపై లోతైన నిబద్ధత అవసరం. భారత్ టెక్స్ 2026 ఈ బాధ్యతను 'గ్లోబల్ టెక్స్‌టైల్ డైలాగ్' ద్వారా నెరవేరుస్తుంది. ఇందులో ప్యానెల్ చర్చలు, రౌండ్‌టేబుల్స్, మాస్టర్‌క్లాస్‌లు, స్టేట్ సెషన్స్, అవార్డ్స్ పిచ్ ఫెస్ట్‌లు, వర్క్‌షాప్‌లతో కూడిన 100 కి పైగా సెషన్లు ఉంటాయి. 370 మందికి పైగా అంతర్జాతీయ, జాతీయ సీఎక్స్‌ఓలు, విధాన నిర్ణేతలు, ఆవిష్కర్తల నేతృత్వంలో జరిగే ఈ సెషన్లు.. వాణిజ్యం మరియు పెట్టుబడుల విస్తరణ, సాంకేతికత మరియు ఆవిష్కరణల పురోగతి, ఫ్యాషన్ మరియు క్రాఫ్ట్‌లను ఉన్నతీకరణ పై దృష్టి సారిస్తాయి. వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతికత, సంస్థాగత సహకారంలో పలు వ్యూహాత్మక ఒప్పందాలు మరియు రంగానికి సంబంధించిన నివేదికల ఆవిష్కరణలు కూడా ఈ వేడుకలో జరగనున్నాయి. ఈ చర్చలలో సుస్థిరత మరియు వనరుల పునరుత్పాదకత అనే కీలక అంశానికి పెద్దపీట వేశారు. మునుపటి ఎడిషన్‌లో ప్రధాని మాట్లాడుతూ, ప్రపంచ ఫ్యాషన్ రంగం 'పర్యావరణం కోసం ఫ్యాషన్' అనే విజన్‌ను ఎక్కువగా స్వీకరిస్తోందని, సుస్థిరత అనేది ఎల్లప్పుడూ భారతదేశ వస్త్ర వారసత్వంలో అంతర్భాగంగా ఉందని గుర్తుచేశారు. ఈ భారత్ టెక్స్ ఎడిషన్ ప్రపంచ పర్యావరణ సవాళ్లను ఒక భారీ అవకాశంగా మారుస్తోంది. వనరుల సామర్థ్యాన్ని పెంచడానికి, వ్యర్థాలను నిర్మూలించడానికి మన సాంప్రదాయ పద్ధతులను సరికొత్త ఆవిష్కరణలు ఎలా ఆధునీకరిస్తున్నాయో ఇది ప్రదర్శిస్తుంది. ఇది నేరుగా మన చేనేత కార్మికులకు, కళాకారులకు ప్రయోజనం చేకూరుస్తుంది. మన వస్త్రాల శాఖ మంత్రి శ్రీ గిరిరాజ్ సింగ్ సమర్థవంతమైన నాయకత్వంలో, మంత్రిత్వ శాఖ ఈ ఆధునీకరణ మరియు సుస్థిర వృద్ధి చర్యలను క్షేత్ర స్థాయిలో వేగవంతం చేసింది. మన మొత్తం వస్త్ర విలువ గొలుసుకి బలమైన ఆధునిక సాంకేతికత, విస్తరించదగిన విధాన చట్రాలు, మెరుగైన మార్కెట్ అనుసంధాన మద్దతు ఉండేలా చూసింది.

భారత్ టెక్స్ ద్వారా ప్రతిబింబిస్తున్న అసాధారణ స్థాయి మరియు ఆత్మవిశ్వాసం, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో గత దశాబ్ద కాలంగా అమలు చేసిన నిరంతర విధాన సంస్కరణల ఫలితమే. గత 12 ఏళ్లలో, మోదీ ప్రభుత్వం పరివర్తనాత్మక చర్యల ద్వారా వస్త్ర విలువ గొలుసులోని ప్రతి లింక్‌ను బలోపేతం చేసింది. వస్త్రాల కోసం ప్రవేశపెట్టిన ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ స్కీమ్ రూ.31,687 కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించింది. ఇది మ్యాన్-మేడ్ ఫైబర్ దుస్తులు, బట్టలు, సాంకేతిక వస్త్రాలలో పెద్ద ఎత్తున తయారీని ప్రోత్సహిస్తూ భారీ ఉపాధిని సృష్టిస్తోంది. అదే సమయంలో, ప్రధాన మంత్రి 5ఎఫ్ విధానాన్ని ప్రతిబింబిస్తూ ఏడు 'పీఎం మిత్ర' పార్కులను సమగ్ర తయారీ పర్యావరణ వ్యవస్థలుగా అభివృద్ధి చేస్తున్నారు. క్షేత్రస్థాయి సాధికారత కూడా అంతే దృఢంగా ఉంది. నేషనల్ హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ద్వారా 794 చేనేత క్లస్టర్లలో దాదాపు రూ.2,000 కోట్లు పెట్టుబడి పెట్టారు. దీని ద్వారా 1.17 లక్షల మంది చేనేత కార్మికులకు ఆధునిక మగ్గాలు, సుమారు 90,000 మంది కార్మికులకు నైపుణ్య శిక్షణను అందించారు. అలాగే నేషనల్ హ్యాండీక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కింద హస్తకళల రంగానికి రూ.1,335 కోట్ల కంటే ఎక్కువ నిధులు కేటాయించారు. అంతేకాకుండా, 1.5 లక్షల కంటే ఎక్కువ మంది చేనేత కార్మికులను గవర్నమెంట్ ఇ-మార్కెట్‌ప్లేస్ పోర్టల్‌లోకి తీసుకువచ్చారు. 'వీవర్స్ ముద్రా స్కీమ్' ద్వారా దాదాపు 3 లక్షల మంది లబ్ధిదారులకు ఎలాంటి పూచీకత్తు లేని రుణాలను అందించారు. మన దేశీయ తయారీదారులు, కళాకారులు, ఆవిష్కర్తలను నేరుగా ప్రపంచ మార్కెట్లతో అనుసంధానించారు. ఈ వారం మనకు కనిపిస్తున్న భారీ ప్రపంచ స్థాయి వేడుక ముందడుగు కోసం ఈ సమగ్ర సంస్కరణలు మనల్ని నిర్మాణాత్మకంగా సిద్ధం చేశాయి. భారత్ మండపంలోని శక్తివంతమైన ప్రదర్శన హాళ్లను చూస్తున్నప్పుడు, మన దృక్పథం కేవలం ఈ వాణిజ్య ప్రదర్శన పరిధిని దాటి చాలా దూరం విస్తరిస్తుంది. భారతదేశ వస్త్ర పరిశ్రమను వి350 బిలియన్ల ప్రపంచ శక్తిగా మార్చాలనే మన 'విజన్ 2030' రోడ్‌మ్యాప్‌లో ఈ ఈవెంట్ ఒక కీలకమైన మైలురాయిగా నిలుస్తుంది. ఈ ప్రయాణం 'వికసిత్ భారత్ ఏ2047' జాతీయ లక్ష్యంతో సంపూర్ణంగా సరిపోలుతుంది. భారతదేశంలో సగర్వంగా రూపకల్పన, సుస్థిరంగా తయారీ, భారీ స్థాయిలో అనుసంధానమైన మన కార్మికుల అద్భుతమైన శక్తిని, సృష్టికర్తల ఆవిష్కరణలను, గ్లోబల్ టెక్స్‌టైల్స్ భవిష్యత్తును వీక్షించేందుకు.. రాబోయే నాలుగు రోజుల పాటు భారత్ టెక్స్ 2026 లో మాతో చేరాల్సిందిగా ప్రతి ఒక్కరినీ నేను ఆహ్వానిస్తున్నాను.

**(రచయిత : కేంద్ర వస్త్రాల శాఖ సహాయ మంత్రి)**

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan